
ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 27.0
కనిష్ఠం : 17.0

అంతా సిద్ధం

నేడు ఉంగుటూరు నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటన



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నాలుగోసారి సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నారు. ఉంగుటూరు నియోజక వర్గంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొనున్నారు. 18 నెలల కూటమి పాలనలో చంద్రబాబు రెండుసార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించగా, ఈ ఏడాది ఫిబ్రవరి 11న నూజివీడులో పీ-4 కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు ఆగిరిపల్లిలో పర్యటించారు. తాజాగా నేడు ఉంగుటూరు నియోజక వర్గంలో పర్యటనకు విచ్చేస్తున్నారు.

- కూటమి ప్రభుత్వం వచ్చాక నాలుగోసారి రాక
- గోపీనాథపట్నంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- నల్లమాడులో మార్గదర్శకులు, బంగారు కుటుంబాలతో ముఖాముఖి
- ఉంగుటూరు పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం
- ఏర్పాట్లలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిమగ్నం
- పీ-4 పై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లా పర్యటనకు సోమవారం విచ్చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో పీ-4 కార్యక్రమం అమలుపై దృష్టి సారించే అవకాశం ఉంది. ఏడు నియోజకవర్గాల్లో 71,876 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి 4,627 మంది మార్గదర్శకులు ముందుకొచ్చారు. వీరంతా కేవలం 43,584 మందిని దత్తత తీసుకున్నారు. వారికి ఉద్యోగ,ఉపాధి, ఇతర సౌకర్యాల కల్పన దిశగా ఇంకా అడుగులు పడలేదు. ఉంగుటూరు నియోజకవర్గంలో 4,661 మంది బంగారు కుటుంబాలకు 467 మంది మార్గదర్శకులు 3,242 మందిని దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చారు. మరోవైపు ఉంగుటూరులో పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేయడానికి ముఖ్య నాయకులతో ఆయన భేటీ కానున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్ కిశోర్



సీఎం చంద్రబాబు పాల్గొనే 'పేదల సేవలో ప్రజా వేదిక' రచ్చబండ వేదిక



ప్రజా వేదిక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

కేడర్‌లో అసంతృప్తి సెగలు

జిల్లా పార్టీని అంటిపెట్టుకున్న పనిచేస్తున్న నాయకులు నామినేటెడ్ పదవుల్లో సరైన గుర్తింపు రాలేదన్న అసంతృప్తి రేగుతోంది. ఎమ్మెల్యే సీటు త్యాగం చేసిన వారికి సరైన సముచిత స్థానాన్ని కల్పించారు. కాగా అప్ లాండ్‌లో నాయకత్వానికి సరైన గుర్తింపును 18 నెలలు కాలంలో ఇవ్వలేదని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన నామినేటెడ్ పదవుల్లోనైనా మాకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఉంగుటూరుకు వరాలిస్తారా?

గత టీడీపీ హయాంలో గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఉంగుటూరు నియోజకవర్గం చాలావరకు అభివృద్ధి చెందింది. ఆపై వైసీపీ (మిగతా 8వ పేజీలో)

సీఎం పర్యటన ఇలా..

ఉదయం 11 గంటలకు సీఎం చంద్రబాబు ఉంగుటూరు మండలం నల్లమాడులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ముఖ్య నాయకులు, జిల్లా అధికారుల స్వాగతం అనంతరం గోపీనాథపట్నం చేరుకుని సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. లబ్ధిదారులతో మాట్లాడి ఆయనే స్వయంగా సొమ్ములు పంపిణీ చేస్తారు. గోపీనాథపట్నం సచివాలయ పరిధిలో హెల్త్ పింఛన్‌ను సీఎం పింఛన్ దారుడి ఇంటి వద్దనే పంపిణీ చేస్తారు. అనంతరం తిరిగి బయల్దేరి నల్లమాడులో ఏర్పాటు చేసిన 'పేదల సేవలో ప్రజా వేదిక' సభా ప్రాంగణం వద్దకు చేరుకుంటారు. బంగారు కుటుంబాల దత్తత దాతలకు పౌరసన్మానం, పీ-4 ప్రాజెక్టు ప్రాముఖ్యత వివరిస్తారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమవుతారు. సాయంత్రం 3.35 గంటలకు ఉండవల్లి బయలుదేరి వెళ్తారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

ఏలూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు 1వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని డీఆర్వో వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం జిల్లాలో పర్యటించనున్న దృష్ట్యా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ్ కలెక్టరేట్‌లో జరగనున్న పీజీఆర్ఎస్‌లో అందుబాటులో ఉండరని తెలిపారు. డీఆర్వో, వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

- 2.60 లక్షల మంది లబ్ధిదారులు.. రూ. 113.72 కోట్లు

ఏలూరుసిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెల సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించి జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం 7గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుంది. అనివార్య కారణాల వల్ల తీసుకోని వారికి 3వ తేదీన పంపిణీ చేస్తారు. 5,039 మంది గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితోపాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 2,59,688 మంది లబ్ధిదారులకు 113 కోట్ల 63 లక్షల 2వేలు పంపిణీ చేయనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తెలిపారు.

జిల్లాలో పంపిణీ చేసే పింఛన్లు

పింఛన్ రకం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం(రూ.)
అభయహస్తం	4,510	23,35,000
అమరావతి లాండ్‌లెస్‌పూర్	7	35,000
సికెడియు ప్రభుత్వ	202	20,40,000
సికెడియు ప్రైవేట్	343	35,20,000
డప్పుకళాకారులు	1,997	80,12,000
విభిన్నప్రతిభావంతులు	32,612	1,9,89,42,000
మత్స్యకారులు	6,037	2,50,60,000
కళాకారుల పెన్షన్	161	6,52,000
వృద్ధాప్య	1,22,821	50,33,96,000
సైనిక్‌వెల్ఫేర్	14	70,000
సింగిల్ ఉమెన్	8,205	3,37,12,000
తలసేమియా	72	7,40,000
కల్లుగీత కార్మికులు	4,438	1,79,00,000
చర్మకారులు	1,634	65,96,000
ట్రాన్స్‌జెండర్	74	3,20,000
నేత కార్మికులు	1,086	44,04,000
వితంతు	73,654	30,40,80,000
డీఎంహెచ్‌వో	1,821	2,44,88,000
మొత్తం	2,59,688	113,63,02,000

పరదాలు, బారికేడ్లు లేని ప్రజావేదిక

నిడమర్రు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):ఉంగుటూరు నియోజకవర్గం నల్లమాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనున్న 'పేదల సేవలో ప్రజావేదిక' కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీలు సీఎం రూట్ మ్యాప్‌కు అనుగుణంగా ఏర్పాట్లలో ఎటువంటి ఆటంకం లేకుండా అధికారులకు సూచనలు చేశారు. కాగా ఆదివారం సాయంత్రం ప్రజావేదిక ప్రాంగణాన్ని తిలకించేందుకు వచ్చిన స్థానికులకు ప్రజా వేదిక ఏర్పాట్లు ఒకింత ఆశ్చర్యాన్ని కలిగించాయి. సాదా సీదా సోఫా, బొంతలు కూడా లేని చెక్క బల్లలపై కూర్చొని ప్రజలతో మమేకమయ్యేలా ప్రజావేదికను ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేయలేదు. ప్రజల మనిషిగా ప్రజలతో మమేకవ్వడానికే ప్రాధాన్యం ఇచ్చినట్టు అవగతం అవుతుంది. కేవలం 12 ముఖ్యులు మాత్రమే ప్రజావేదికపై ఉండనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలతో పరదాలు లేని ప్రజా పాలన అందివ్వాలనే ఉద్దేశ్యంతో రచ్చబండ తరహాలో ప్రజావేదికను సాదాసీదాగా ఏర్పాటు చేశామని, దీని ద్వారా ప్రజలకు మరింత చేరువ అవడానికి వీలవుతుందని పార్టీ నాయకులు చెబుతున్నారు. సీఎం చంద్రబాబు మీటింగ్‌లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తి ఏర్పాట్లు చేశారు. వాతావరణ శాఖ వర్ష సూచన చెప్పడంతో వర్షం వల్ల సభ నిర్వహణకు ఆటంకం కలగకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో ఇప్పటికే కంకరతో ప్రధాన మార్గం ఏర్పాటు చేశారు.



దిత్వా గుబులు

- జిల్లాలో కురుస్తున్న వర్షాలు
- రైతుల్లో ఆందోళన
- 99,453 ఎకరాల్లో కోతలు పూర్తి

ఏలూరుసిటీ, నవంబరు 30(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సమయంలో భారీగా వర్షాలు కురిస్తే వరి పంట దెబ్బతింటుందన్న ఆందోళన రైతులు ఆందోళన చెందుతున్నారు. దిత్వా తుఫాన్ ఎఫెక్ట్‌తో జిల్లా వ్యాప్తంగా వర్షాలు ప్రారంభం కావడంతో రైతుల్లో గుబులు మొదలైంది. కోసిన వరి పంటను రక్షించుకోవడానికి కల్లాల్లో కుప్పలు వేసి బరకాలు కప్పుతున్నారు. బయట ఆరబోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాల్లో నిల్వ చేసుకుంటున్నారు. దిత్వా తుఫాన్ కారణంగా జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ ముందస్తుగానే హెచ్చరికలు జారీ చేసింది. అయితే తుఫాన్ దిశ మార్చుకుంటుందని సామాజిక మాధ్యమాల్లో సమాచారం వస్తుం డటంతో రైతులు ఈ ప్రాంతంలో సోమవారం నుంచి వర్షాలు ఏ విధంగా కురుస్తాయోనన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. దిత్వా తుఫాన్ ప్రభావంతో ఏపీకి ఐఎండీ బిగ్ అలెర్ట్‌ను జారీ చేసింది. దక్షిణకోస్తా, రాయలసీమ జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా ఆది, సోమవారాల్లో ఏలూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.



ముదినేపల్లి వద్ద ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్న రైతులు



పెదవేగి వద్ద ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు



పెదపాడు వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

వర్షాలు కురిస్తే నష్టమే..

జిల్లాలో సార్వాసాగులో భాగంగా ఇప్పటి వరకు 99,453 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. జిల్లాలో ఇంకా 1,07,833 ఎకరాల్లో వరి కోతలు పూర్తి కావాల్సి ఉంది. అయితే కోసిన వరి పంట కొంతవరకు కల్లాల్లోనే ఉంది. ధాన్యం తడిస్తే తేమశాతం పెరిగిపోతుందని, దీనివల్ల ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటే జిల్లాలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది.





వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తెప్పోత్సవం

ముదినేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): షష్టి కల్యాణోత్సవాల సందర్భంగా ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తెప్పోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. దేవస్థానం పక్కనే ఉన్న పుష్కరిణిలో జరిగిన తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు తరలి వచ్చారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, ఉప్పలపాటి విమల, దగాని నాగలక్ష్మి, బెజవాడ నాగ వెంకట రాధాకృష్ణ తదితరులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విశేష రీతిలో హంసవాహనంలో రూపొందిం చిన తెప్పపై స్వామి వార్ల తెప్పోత్సవాన్ని నిర్వహించారు. బాణసంచా కాల్పుల నడుమ భక్తుల జై సుబ్రహ్మణ్యేశ్వరా నినాదాల మధ్య సుమారు రెండు గంటల పాటు తెప్పోత్సవం జరిగింది. కైకలూరు సీఐ రవికుమార్ ఆధ్వ ర్యంలో ముదినేపల్లి, మండవల్లి ఎస్ఐలు వీర భద్రరావు, రామచంద్రరావు ఆధ్వర్యంలో 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీర మల్లు నరసింహారావు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, దేవస్థానం మాజీ చైర్మ న్లు పసుపులేటి నరసింహారావు, బండి నాగ రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.





రైతుల మధ్య ఘర్షణ దృశ్యం

ఇరు గ్రామ రైతుల మధ్య భూ వివాదం


- 13 మందికి గాయాలు

శ్రీవారి భక్తులకు డిజిటల్ సేవలు

లోపలి పేజీలో..

జేఈఈ మెయిన్ ఫిజిక్స్ ప్రిపరేషన్

కాన్సెప్ట్ తెలిస్తే కష్టం కాదు



టెన్త్, ఇంటర్ వంటి అకడమిక్ పరీక్షలకు, కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు తేడా ఉంది. అకడమిక్ పరీక్షల్లో మంచి మార్కుల కోసం పాఠ్య పుస్తకాల్లోని విజ్ఞానం సరిపోతుంది. అదే పోటీపరీక్షలకు లోతుగా అధ్యయనం చేయాలి. సిలబస్‌కు అనుగుణంగా ప్రిపేర్ కావాలి. మోడల్ పేపర్స్ సాధన చేయాలి. మాక్ టెస్టులకు హాజరుకావాలి. అలాగే ప్రతి మార్కు మంచి ర్యాంకు సాధనలో కీలకమే. ఈ నేపథ్యంలో జేఈఈ మెయిన్‌లో ఫిజిక్స్‌కు ఎలా ప్రిపేరైతే మంచిదో పరిశీలిద్దాం.

సబ్జెక్టు పరిజ్ఞానానికి తోడు ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ తెలియాలి. అందుకోసం క్లిష్టమైన వాటిని విశ్లేషించే సామర్థ్యాన్ని అలవర్చుకోవాలి.

- మొదట సబ్జెక్టుపై సిలబస్‌కు అనుగుణంగా సంపూర్ణ అవగాహన కలుగజేసుకోవాలి. తదుపరి రెగ్యులర్ ప్రాక్టీస్‌తో సబ్జెక్టుపై పట్టు లభిస్తుంది.
- వారాంతంలో జరిగే పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చినప్పటికీ ఇబ్బంది పడాల్సిందేమీ లేదు. ఫెయిల్యూర్‌ను సక్సెస్‌కు తొలిమెట్టుగా భావించాలి. అసలా ప్రశ్నను ఎలా అర్థం చేసుకున్నాం, సమాధానాన్ని కనుగొనే క్రమంలో ఎక్కడ తప్పు దొర్లింది అన్నది తెలుసుకుని, సరైన పద్ధతిలో దాన్ని నేర్చుకోవాలి. ఆ తప్పు పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- ఒక సమస్యకు పరిష్కారం కనుగొనే పద్ధతిలో వేగమే కాదు, కచ్చితత్వానికీ ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్కుల స్కోర్ పెంపు కోసం

- గడచిన ప్రశ్నపత్రాలను విశ్లేషించుకుంటే కొన్ని చాప్టర్లకే ప్రాధాన్యం ఇస్తున్నట్టు అర్థమవుతుంది. 75 శాతం ప్రశ్నలు 25శాతం చాప్టర్ల నుంచే వస్తున్నాయి. 25 ప్రశ్నలకు అంటే అందులో కనీసం 15కి సమాధానాలు సరిగ్గా గుర్తించగలిగితే చాలు, సీటు గ్యారంటీ వస్తుంది.
- చాప్టర్ల వారీగా అవి... ప్రశ్నల లెక్కన మోడ్రన్ ఫిజిక్స్(4), కరెంట్ ఎలక్ట్రిసిటీ(3), ఎలక్ట్రోస్టాటిక్స్(2), రే ఆప్టిక్స్(2), మెకానిక్స్(5), వేవ్స్(3), థర్మోడైనమిక్స్(2)

ఎలా చదవాలంటే?

- డిసెంబర్ నెలంతా రోజుకు ఒక చాప్టర్ చొప్పున సబ్జెక్టు అంతా చదవాలి.
- డివైడ్ అండ్ కాంకర్ అంటే చాప్టర్‌ను అయిదారు భాగాలుగా విభజించుకుని పట్టు సాధించాలి.
- కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునేందుకు షార్ట్ నోట్స్‌ని ఉపయోగించాలి. ప్రాబ్లెమ్‌ని సాల్వ్ చేసే పద్ధతిలో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునే పద్ధతిని తెలుసుకోవాలి.
- ప్రతి రోజూ పది నుంచి ఇరవై ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేయాలి. ఎక్కడైనా తప్పు దొర్లితే దాన్ని కనీసం అయిదారు సార్లు ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి అదివారం ఫుల్ సిలబస్‌పై ఒక మోడల్ టెస్ట్ ప్రాక్టీస్ చేయాలి.
- నెగెటివ్ మార్కులు రాకుండా జాగ్రత్త పడాలి. టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. ర్యాండమ్ వీడియోలు చూసి టైమ్ వృథా చేసుకోవద్దు.
- ప్రిపరేషన్ మొదటి రోజు నుంచి మార్కులు అని కాకుండా సబ్జెక్టుపై దృష్టి పెట్టడం మంచిది.
- సీటు తెచ్చుకోవడం ఎంత మాత్రం మేజిక్ లేదంటే లక్ కాదని విద్యార్థులు గ్రహించాలి. ఎంతో కృషి ఉంటేనే అనుకున్న సీటు లభిస్తుందని తెలుసుకోవాలి.

రెండు రకాలు

- మొదటిది కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవడం. అందుకు ఎన్‌సీఈఆర్‌టి పుస్తకాలతో సొంత నోట్స్‌ను రూపొందించుకోవాలి.
- కాన్సెప్ట్‌ను నేర్చుకునేందుకు థియరీ ఓరియెంటెడ్ మెటీరియల్ చాలు. రేఖా చిత్రాలు, చార్టులు, టేబుల్స్‌తో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవాలి.
- ప్రతి చాప్టర్‌పై ఒకట్రెండు పేజీల మేర షార్ట్ నోట్స్‌ను తయారు చేసుకోవాలి.
- కాన్సెప్టును గుర్తుంచుకోవడంలో విజువలైజేషన్ టెక్నిక్స్, టిప్స్ సహాయపడతాయి.
- ఫార్ములా లేదా చార్టులను గుర్తుంచుకోవడంలో న్యూమానిక్స్(జ్ఞప్తికి తెచ్చుకోవడం) కీలకం. ఉదాహరణకు ఇఎండబ్ల్యు చాప్టర్‌లో ఎప్పుడూ ఒక ప్రశ్న వస్తుంది. చాలా సార్లు ఈ ప్రశ్న ఇఎండబ్ల్యుకు సంబంధించిన వేవ్‌లెంథ్/ ఫ్రీక్వెన్సీ శక్తి ఆర్డర్‌పైన ఉంటుంది. ఉదాహరణకు - రేడియో వేవ్స్ - మైక్రో వేవ్స్ - ఇన్‌ఫ్రారెడ్ రేస్ - విజిబుల్ రేస్ - అల్ట్రావయలెట్ రేస్ - ఎక్స్ రేస్ - గామా(ఆర్) రేస్ - కాస్మిక్ రేస్

దీనిని గుర్తుంచుకునేందుకు.... రెడ్ మార్షియన్స్ ఇన్వేడెడ్ వీనస్ యూజింగ్ ఎక్స్‌రే గన్ లేదా మా ఇంటికి వచ్చి ఉండు ఇష్టం లేకపోతే రాకు అన్న పద్ధతి ఉపయోగించాలి.

- ఇదే విధంగా రేడియో యాక్టివ్ సిరీస్ ఆర్డర్‌ను గుర్తుంచుకోవచ్చు. థోరియం సిరీస్(4ఎన్), నెప్టూనియమ్ సిరీస్(4ఎన్+1), యురేనియమ్ సిరీస్(4ఎన్+2), యాక్టీనియం సిరీస్(4ఎన్+3). దీని కోసం సినిమా రంగం ఆంధ్రలోకి ఎలా వచ్చిందో చెబితే సరిపోతుంది. తమిళనాడు(టిఎన్) ఉత్తర ఆంధ్ర(యుఎ) - రివర్స్‌లో అంటే - ఎయుఎన్‌టి అని గుర్తుంచుకోవచ్చు.
- రెండోది ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్. ప్రాబ్లెమ్‌ను పూర్తిగా చదవాలి. దానికి సంబంధించిన ఫార్ములా ఉపయోగించాలి. రోజుకు ఒకటి రెండు గంటలు న్యూమరికల్స్ ప్రాక్టీస్ చేయాలి. గడచిన అయిదేళ్ళ ప్రశ్నపత్రాలను సాల్వ్ చేస్తే సంపూర్ణ అవగాహన కలిగించుకోవచ్చు.

డాక్టర్ కిషన్‌రావ్ టంకశాల,
బన్సాల్ క్లాసెస్, హిమయతనగర్, హైదరాబాద్

దిక్సూచి

మ్యాట్

దేశంలోని బిజినెస్ స్కూళ్ళలో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్షల్లో మేనేజ్‌మెంట్ అప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) ఒకటి. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) దీన్ని ఏటా నాలుగుసార్లు నిర్వహిస్తుంది. ప్రస్తుతం డిసెంబర్‌లో నిర్వహించే పరీక్షకు ప్రకటన ఇచ్చింది. డిగ్రీ ఉత్తీర్ణులకు తోడు కోర్సు చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) అలాగే పీపీటీ+సీబీటీగా అంటే మూడు రకాలుగా ఈ టెస్ట్‌ను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని కాలేజీలకు తోడు దేశవ్యాప్తంగా ఆరువందలకు పైగా సంస్థల్లో ప్రవేశానికి ఈ స్కోర్ ఉపయోగపడుతుంది. అలాగే ఇందులో సాధించిన స్కోర్ ఏడాది పాటు చెల్లుతుంది.
- రెండు గంటల వ్యవధికలిగిన ఈ పరీక్షలో అయిదు విభాగాల నుంచి 150 ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, మేథమెటికల్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిషియెన్సీ, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. సమాధానాన్ని కరెక్ట్‌గా గుర్తిస్తే ఒక మార్కు ఇస్తారు. తప్పుగా గుర్తిస్తే పావు మార్కు తగ్గిస్తారు. వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నలు ఉన్నాయి. ఇటు క్యాట్, అటు ఐసెట్‌కు మధ్యస్థంగా మ్యాట్ ఉంటుంది.
- **పీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 7
- **సీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 15
- **పేపర్ ఆధారిత పరీక్ష తేదీ:** డిసెంబర్ 13
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** డిసెంబర్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** పేపర్ ఆధారిత - హైదరాబాద్, విశాఖపట్టణం; కంప్యూటర్ ఆధారిత - హైదరాబాద్, విజయవాడ
- **వెబ్‌సైట్:** https://mat.aima.in



మేనేజ్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) 2026-28 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీడీఎం(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్ సంబంధ కోర్సులో డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. 2025 క్యాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఎస్సే రైటింగ్, అకడమిక్ రికార్డ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: www.manage.gov.in/ABMAdmissions/appln.pdf

జాబ్ కార్నర్

బీడీఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) 80 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జీ, కెమికల్, సివిల్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాలో 55 నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ - డిప్లొమా, సీఏ/ ఐసీడబ్ల్యుఏఐ పాసై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు: డిసెంబర్ 3 నుంచి 29 వరకు

వెబ్‌సైట్: https://bdl-india.in

भारत डायनामिक्स लिमिटेड
BHARAT DYNAMICS LIMITED

అప్రెంటిస్‌షిప్

బీడీఎల్ - కంచన్‌బాగ్ యూనిట్‌లో 156 ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ ఖాళీలు ఉన్నాయి.

ట్రేడ్‌లు: ఫిట్టర్ 70, ఎలక్ట్రీషియన్ 10, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 30, మెషినిస్ట్ 15, మెషినిస్ట్ గ్రైండర్ 2, మెకానికల్ డీజిల్ 5, మెకానిక్ ఆర్ అండ్ ఏసీ 5, టర్నర్ 15, వెల్డర్ 4

అర్హత: టెన్త్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో అభ్యర్థి ఉత్తీర్ణులై ఉండాలి.

వయస్సు: డిసెంబర్ 8 నాటికి వయస్సు 14-30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి.

ఎంపిక: విద్యార్హతలు, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా

దరఖాస్తు: అప్రెంటిస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కు డిసెంబర్ 8(హార్డ్ కాపీలు పంపేందుకు డిసెంబర్ 12)

వెబ్‌సైట్: www.apprenticeshipindia.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు

బ్యాంక్ ఆఫ్ బరోడా 82 మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది

పోస్టులు: జోనల్ రిసీవబుల్ మేనేజర్ 13, రీజినల్ రిసీవబుల్ మేనేజర్ 13, ఏరియా రిసీవబుల్ మేనేజర్ 49, కంప్లయన్స్ మేనేజర్ 1, కంప్లయింట్ మేనేజర్ 1, ప్రాసెస్ మేనేజర్ 1, వెండర్ మేనేజర్ 1, ఫ్లోర్ మేనేజర్ 3

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 9

వెబ్‌సైట్: www.bankofbaroda.bank.in

చిత్రజ్యోతి

SINCE 1965

మాస్ సాంగ్‌కు చిరు.. వెంకీ స్టెప్స్



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. హీరో వెంకటేశ్ ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ అగ్రహీరోలిద్దరూ సినిమాలో ఓ గీతానికి కాలు కదపనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఓ అదిరిపోయే మాస్ గీతాన్ని భారీ సెట్ వేసి షూట్ చేస్తున్నారు. దాదాపు 500 మంది డ్యాన్సర్లతో కలర్‌ఫుల్‌గా ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. విజయ్ పొలకి ఈ పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ మాస్ గీతం వచ్చే ఏడాది విడుదలయ్యే ఉత్తమ పాటల్లో ఒకటిగా నిలిచిపోతుంది, వీరిద్దరి ఎనర్జీ, స్టైల్ ప్రేక్షకులకు అద్భుతమైన వినోదం అందించనుందని మేకర్స్ చెప్పారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం విడుదల కానుంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, సినిమాటోగ్రఫీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



దుల్కర్ కొత్త సినిమా

మలయాళ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ 'ఐ యామ్ గేమ్' అనే కొత్త సినిమాతో అలరించబోతున్నారు. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. మేకర్స్ ఆదివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్‌డ్రాప్‌లో స్టయిలిష్ సూట్ వేసుకున్న దుల్కర్ రక్తం తడిసిన చేతితో గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం అదిరిపోయింది. మిస్కిన్, ఆంటోని వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అఖండ నుంచి అవతార్ వరకూ...

● డిసెంబర్‌లో బాక్సాఫీస్ వార్



ప్రతి ఏటా సంక్రాంతి వస్తుందంటే చాలు, సినిమా ప్రేమికులకు పండగే. కానీ ఈ సారి డిసెంబర్ మాత్రం మామూలుగా లేదు. బాక్సాఫీసు రికార్డులు బద్దలుకొట్టేందుకు పాన్ ఇండియా స్టార్ల నుంచి హాలీవుడ్ దిగ్గజాల వరకూ అందరూ క్యూ కట్టారు. నందమూరి బాలకృష్ణ 'అఖండ 2' గర్జనతో మొదలై, జేమ్స్ కామెరాన్ సృష్టించబోయే విజువల్ వండర్ వరకూ... ఈ ఏడాది ముగింపు బాక్సాఫీసు దగ్గర వేడి పుట్టించనుంది.

మొదటి వారమే మాస్ జాతర

డిసెంబర్ నెల ఆరంభమే అదిరిపోయే రేంజ్‌లో ఉండబోతోంది. 'అఖండ'లో అఘోరాగా విశ్వరూపం చూపారు బాలకృష్ణ. ఆ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన 'అఖండ 2' డిసెంబర్ 5న థియేటర్లలో విడుదలకు దిగుతోంది. అదే రోజు బాలీవుడ్ హీరో రణ్‌వీర్‌సింగ్ 'ధురంధర్', మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన 'కలంకావల్' చిత్రాలు విడుదలవుతున్నాయి.

- రెండో వారంలో 'అన్నగారు వస్తారు' అంటూ కార్తీ సందడి చేయనున్నారు. దీంతోపాటు 'మోగ్లీ, సైక్ సిద్ధార్థ' చిత్రాలు కూడా డిసెంబర్ 12నే విడుదలవుతున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న తేదీ డిసెంబర్ 19. జేమ్స్ కామెరాన్ తెరకెక్కించిన దృశ్యకావ్యం 'అవతార్ 3' వెండితెరపై అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉంది. దీనికి ఒక రోజు ముందు ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం విడుదలవుతోంది.

క్రిస్మస్ కిటకిట: సంక్రాంతిని తలపించేలా క్రిస్మస్ రోజునా బాక్సాఫీసు దగ్గర పలు చిత్రాలు వరుస కడుతున్నాయి. డిసెంబర్ 25న ఏకంగా ఏడు సినిమాలు విడుదలవుతున్నాయి. మోహన్‌లాల్ 'వృషభ', హాలీవుడ్ మూవీ 'అనకొండ', గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన యూత్‌ఫుల్ డ్రామా 'యుఫోరియా', రోషన్ మేకా హీరోగా నటించిన క్రీడా నేపథ్య చిత్రం 'ఛాంపియన్'తో పాటు 'శంభల, దండోరా, పతంగ్' చిత్రాలు ఒకే రోజు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. డిసెంబర్ బరిలో నిలిచిన చిత్రాలు డజనుకు పైగానే ఉన్నాయి. మరి వీటిలో ఎన్ని చిత్రాలను విజయం వరిస్తుందో వేచి చూడాలి.

లెజెండ్‌తో నటించడం నా అదృష్టం

హర్షాలి మల్హోత్రా



'**బా**లకృష్ణ గారి లాంటి లెజండరీ యాక్టర్‌తో కలసి నటించడం నిజంగా నా అదృష్టం. సెట్‌లో ఆయన చిత్ర బృందంతో సరదాగా ఉన్నారు. తెలుగు సినిమాకు కొత్త వ్యక్తిని అయిన నన్ను ఎంతో ప్రోత్సహించారు. బాలకృష్ణగారు వెరీ ఎనర్జిటిక్, అన్‌స్టాపబుల్' అని అన్నారు నటి హర్షాలి మల్హోత్రా. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం'లో ఆమె కీలక పాత్ర పోషించారు. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ బేనర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. ఈనెల 5న విడుదలవుతున్న సందర్భంగా హర్షాలి మీడియాతో మాట్లాడారు.

- దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ తెరముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బంజరంగీ భాయిజాన్' చిత్రం తర్వాత కొంత గ్యాప్ వచ్చింది. ఈ సమయంలో చదువుపై దృష్టి పెట్టాను. అలాగే కథక్ నృత్యం కూడా నేర్చుకున్నాను. ఒక మంచి పాత్ర కోసం ఎదురు చూస్తున్నప్పుడు 'అఖండ 2'లో అవకాశం వచ్చింది.
- ఈ చిత్రంలో నేను జననీ అనే పాత్రలో కనిపిస్తాను. జననీ జీవితం ప్రమాదంలో పడినప్పుడల్లా అఖండ వచ్చి రక్షిస్తాడు. ఈ సినిమాలో నేను కొన్ని యాక్షన్ స్టంట్స్ కూడా చేశాను.
- డైరెక్టర్ బోయపాటి గారు 'నువ్వు తప్పకుండా చేయగలవు' అని ఎంతో ప్రోత్సహించేవారు. సన్నివేశం పూర్తయిన తర్వాత 'అద్భుతంగా చేశావ'ని అభినందించేవారు. నాకు సంజయ్ లీలా బన్సాలీ గారి సినిమాలో నటించాలని ఉంది. ఆయన హీరోయిన్లని చూపించే విధానం అద్భుతంగా ఉంటుంది.



సుకుమార్ చిత్రంలా ఉంటుంది

'సహకుటుంబానాం' నా స్నేహితుడు విక్రమ్ చేయాలనుకున్న సినిమా. కానీ ఆయన చనిపోవడంతో ఆ కథ లైన్‌ను తీసుకుని ఉదయ్ చేశాడని తెలిసి ఎంతో సంతోషించా. ఈ చిత్రం సుకుమార్ గారి ఆలోచనలాగా ఉంటుంది. అందర్నీ ఆకట్టుకుంటుంది' అని దర్శకుడు బుచ్చిబాబు సానా అన్నారు. రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ తెరకెక్కించిన చిత్రం 'సహకుటుంబానాం'. హెచ్.మహదేవ్ గౌడ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను బుచ్చిబాబు సానా విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'ఇటువంటి కథను నా 48 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ వినలేదు. చాలా ప్రత్యేకంగా ఉండబోతోంది' అని చెప్పారు. రామ్‌కిరణ్ మాట్లాడుతూ 'అందరి అంచనాలను అందుకునేలా ఈ సినిమా ఉంటుంది. కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని తెలిపారు.

కన్నడ హాస్యనటుడు ఉమేశ్ కన్నుమూత



ప్రముఖ కన్నడ హాస్యనటుడు ఉమేశ్ (80) ఆదివారం ఉదయం బెంగళూరులో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడిగతోపాటు పలువురు అభిమానులు, సినీ నటులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. ఉమేశ్ 1945 ఏప్రిల్ 22న మైసూరులో జన్మించారు. బాల్యంలోనే ఉమేశ్ పలు సినిమాల్లో నటించారు. కే హిరణ్ణయ్య మిత్రమండలిలో చేరాక పలు నాటకాల్లో భిన్నమైన పాత్రలను పోషించారు. 350 సినిమాఉల్లో నటించారు. ఆయనకు భార్య ఉష, కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం బనశంకరి స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)


సందేశాత్మక చిత్రంతో

ప్రస్తుత భారతదేశ, సామాజిక, రాజకీయ ఇతివృత్తంతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు నిర్మాత అతీకూర్ రెహమాన్ తెలిపారు. నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ చిత్రం వివరాలను ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరించారు. 'టాలీవుడ్‌లో ఆర్‌ఎక్స్ ఫ్లోర్ మూవీస్ అనే కొత్త బేనర్‌ను ఏర్పాటు చేశాం. వినోద ప్రధానమైన చిత్రాలతో పాటు పలు సామాజిక సమస్యలపై సందేశాత్మకంగా ఉండే చిత్రాలను నిర్మిస్తాం. ఈ నెల్లోనే సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తాం' అని తెలిపారు.



చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలా?

అదూర్ గోపాలకృష్ణన్



ప్రముఖ మలయాళ సినీ దర్శకుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అదూర్ గోపాలకృష్ణన్ జాతీయ చలనచిత్ర అవార్డుల ఎంపికపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత కొంతకాలంగా చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలు దక్కుతున్నాయని ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాసిరకం చిత్రాల ఎంపికకు జ్యూరీ అసమర్థతే ప్రధానకారణం అని ఆరోపిస్తూ, అర్హత కలిగిన జ్యూరీ ఉంటేనే సరైన చిత్రాలకు గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. నాణ్యమైన సినిమాలను గుర్తించి, ప్రోత్సహించడమే జాతీయ అవార్డుల ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమనీ, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ నిర్ణేతల ప్రమాణాలు తక్కువగా ఉంటే, వారి గుర్తింపు కోసం నాసిరకం చిత్రాలనే పురస్కారాలకు ఎంపిక చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే జాతీయ పురస్కారాలను ఇవ్వడం మానుకుంటే మంచిదని గోపాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో మలయాళ చిత్రం 'ది కేరళ స్టోరీ' కి అవార్డులు రావడంపై గోపాలకృష్ణన్ కొన్నాళ్లుగా పరోక్షంగా విమర్శలు చేస్తున్నారు.



సభలో మాట్లాడుతున్న ఎస్‌సీజెడ్ఐఈఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

ఎల్ఐసీని అగ్రగామి సంస్థగా నిలుపుదాం

ఎస్‌సీజెడ్ఐఈఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

పాలకొల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జీవిత బీమా సంస్థను అన్నివిధాలుగా అగ్రగామిగా నిలపడం ఉద్యోగులుగా మనందరి బాధ్యత అని ఎస్‌సీజెడ్ఐఈఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో రాజమండ్రి డివిజన్ 28వ మహాసభ డివిజన్ ఉపాధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఐఆర్‌డీఏఐ కొత్త ప్రతిపాదనల నేపథ్యంలో యూనియన్ సభ్యులుగా మన బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్‌లో మార్పులు, చేర్పులు పాలసీదారుల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. సంస్థను అభివృద్ధి చేస్తూ ఉద్యోగుల ప్రయోజనాలను రక్షించుకోవాలని రవీంద్రనాథ్ సూచించారు. జీవిత బీమా ప్రీమియం ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్‌టి రద్దు మన సంఘం కృషితో జరిగిందన్నారు. ప్రత్యేక అతిథి రాజమండ్రి డివిజన్ ఎల్ఐసీ ఎస్‌డీఎం సత్యనారాయణ సాహు మాట్లాడుతూ ఉద్యోగులంతా సమైక్యంగా ఉండాలని సూచించారు. బ్రాంచ్ యూనియన్ నాయకులు మురళీకృష్ణ, ఆహ్వాన సంఘం కన్వీనర్ ఎన్‌వీఎస్.బాపిరాజు, ఎం.కోదండరామ్ తదితరులు మాట్లాడారు. డివిజన్‌లోని పలు బ్రాంచ్‌ల సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ్ చాలక్ రామకృష్ణ

నేడు హిందూ సమ్మేళనం

తాడేపల్లిగూడెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ధర్మపరిరక్షణ లక్ష్యంగా తాడేపల్లిగూడెంలో సోమవారం జరిగే హిందూ సమ్మేళనాన్ని హిందువులంతా జయప్రదం చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సహ సంచాలక్ సుంకవల్లి రామకృష్ణ పిలుపునిచ్చారు. చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా తాడేపల్లిగూడెంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక ఎన్‌కే గ్రౌండ్స్‌లో సోమవారం సమ్మేళనం జరుగుతుందన్నారు. నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, కార్యదర్శిగా ముత్తా రామారావు, కోశాధికారిగా పేరూరి బాలకాశీయ్య, సభ్యులుగా మాకా శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, గ్రంధి సత్యనారాయణ, బీజేపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, దువ్వ శ్రీను, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, తదితరులు మాట్లాడారు.

పాలకుల విధానాలకు ప్రతిఘటన తప్పదు

పెనుగొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో ఉద్యోగులు, కార్మికులు, కష్టజీవుల కష్టాన్ని కార్పొరేటర్లకు దోచిపెట్టే విధానాలను అమలు చేస్తున్నాయని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. సీఐటీయూ జిల్లా 13వ మహాసభ ఆదివారం రెండో రోజు జరిగింది. కార్మిక ఐక్యత, వేతనాలు, పనిగంటలు, చట్టాల కోసం పోరాటం, దోపిడి లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా సీఐటీయూ పని చేస్తుందన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను చట్టాలను కాలరాస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏకపక్షంగా నిర్ణయాలు చేస్తున్నాయని, వీటికి ప్రతిఘటన తప్ప మరోమార్గం లేదన్నారు. రానున్న కాలంలో అలాంటి గొప్ప ప్రతిఘటనతో ఈ విధానాల్ని ఎదుర్కొనగలమన్నారు. కార్పొరేట్ శక్తులు దళారులు కలిపి ప్రజల్ని భ్రమలకు గురిచేసి పాలన సాగిస్తున్నారన్నారు. మహాసభలో భవిష్యత్ కర్తవ్యాలను కె.రాజారామ్మోహనరాయ్ వివరించారు. జెఎన్వీ.గోపాలం, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పీవీ.ప్రతాప్, ఎం.అంజనేయులు, ఎం.త్రిమూరులు, కల్యాణి పాల్గొన్నారు.

7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష


భీమవరం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిసెంబరు నెల 7న జరుగుతుందని డీఈవో నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్‌లను ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కార్యాలయం వెబ్‌సైట్ www.bse.ap.gov.in అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. వాట్సాప్ ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునే విధానం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు.

ధాన్యం తుకాల్లో మోసాలు

భీమవరం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుపై అధికారులు ఎన్ని ప్రకటనలు చేసిన తూకాల్లో మోసాలు, తేమశాతం పేరుతో దోపిడీ ఆగడంలేదని కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. పెనుమంట్ర, ఇరగవరం, పెనుగొండ, పోడూరు మండలాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు సమస్యలపై రైతులతో మాట్లాడామన్నారు. జిల్లాలో అధిక వర్షాలు, తుఫాను కారణంగా వరి దిగుబడి బాగా తగ్గిందన్నారు. ఎకరాకు 20 నుంచి 25 బస్తాల దిగుబడి వస్తుందని, ఆరుదలతో మరింత తగ్గుతుందని తెలిపారు. కౌలు కాకుండా ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి అయిందని రైతులు తెలిపారన్నారు. ధాన్యం పట్టేటప్పుడు సంచితో కలిపి 40 కేజీల 600 గ్రాములు తూకానికి అదనంగా మరో600 గ్రాములు వేసి 41 కేజీల 200 గ్రాములు తూస్తున్నారని ఆరోపించారు.

పెరిగిన చికెన్ ధర

కిలో రూ.280



తణుకు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. గత నెలలో కార్తీక మాసం అమ్మకాలు తగ్గుతాయని ఉత్పత్తి తగ్గించారు. ప్రస్తుతం అమ్మకాలు పెరిగినా ఉత్పత్తి అదే స్థాయిలో లేకపోవడంతో ధరలు పెరిగాయి. గత పది రోజులుగా బ్రాయిలర్ (స్కిన్‌లెస్) కేజి 240 ధరకు విక్రయించగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.280 ధర ఉంది. కాగా తణుకు పరిసర ప్రాంతాల్లో చికెన్ అమ్మకాలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

అమ్మకాలు సగానికి తగ్గిపోయాయి

ప్రస్తుతం మార్కెట్‌లో చికెన్ అమ్మకాలు చాలా వరకు తగ్గాయి. రోజు వారి అమ్మకం సగం వరకు పడిపోయింది. వ్యాపారులు ఒక్కోచోట ఒక్కో ధరకు అమ్ముతున్నారు. పది రోజుల నుంచి ధర పెరుగుతూ వస్తుంది. మరో 15 రోజులు ధరలు పెరిగే అవకాశం ఉంది.

- చిలుకూరి సత్యనారాయణ, చికెన్ వ్యాపారి, తణుకు

సత్తెమ్మ గుడి తొలగించాలని హైకోర్టు ఆదేశం

నరసాపురం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీతారాంపురం రాజుల పాలెం గ్రామం వద్ద ప్రభుత్వ స్థలం అక్రమించి కొందరు సత్తెమ్మ గుడి నిర్మించారు. మంచినీటి ట్యాంక్ సమీపంలో గుడి తొలగించాలంటూ చెరుకూరి మాధవి, సత్య వరప్రసాద్‌రాజు ఏపీ, తెలంగాణ హైకోర్టులో గత డిసెంబర్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ పోరంబోకు స్థలంలో నిర్మించిన దేవతా మూర్తుల విగ్రహాలు, గుడిని తొలగించాలని కోర్టు అదేశాలు జారీ చేసినట్లు చెరుకూరి సత్యవరప్రసాద్ చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, స్థానికులకు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పిటిషన్ వేసామని, సత్యవరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ

చిన్న తిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. దేవస్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో నిండాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. పది వేలమందికి పైబడి యాత్రికులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. శ్రీవారి నిత్యార్జిత కల్యాణంలో దాదాపు 90 జంటలు పాల్గొన్నాయి.

- ద్వారకాతిరుమల


వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

అమ్మా.. గుబ్బల మంగమ్మ

అడవి బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మ దర్శనాలకు భక్తులు ఆదివారం పోటెత్తారు. అనేక ప్రాంతాల నుంచి దర్శనాలకు తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోమోగింది. వాతావరణంలో మార్పుల కారణంగా వెలుతురు ఉండగానే అడవి నుంచి బయటకు వెళ్లాలని ఆలయ కమిటీవారు భక్తులకు స్పష్టం చేశారు.

- బుట్టాయగూడెం


గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మద్దిలో హనుమద్ హోమం

గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం హనుమద్ హోమంను అర్చకులు, వేద పండితులు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో ఈ హనుమద్ హోమం ప్రతీ ఆదివారం భక్తులకు ఆర్జిత సేవగా నిర్వహిస్తున్నామని, హోమంలో ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా గానీ పాల్గొన్న వారికి ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత కలుగుతుందనే నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో చందన తెలిపారు.

- జంగారెడ్డిగూడెం రూరల్


హనుమద్ హోమం నిర్వహిస్తున్న పండితులు


పట్టిసీమ శివాలయంలో కస్టమ్స్ కమిషనర్ శ్రీధర్ పూజలు

పట్టిసీమ శివక్షేత్రంలో కస్టమ్స్,జీఎస్టీ కమిషనర్ శ్రీధర్ పూజలు

పోలవరం, నవంబరు30(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ శివక్షేత్రాన్ని కస్టమ్స్ అండ్ జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్ ఆదివారం సందర్శించారు. విశాఖపట్టణం నుంచి రాజమహేంద్రవరం డివిజన్ కార్యాలయాల తనిఖీలకు వచ్చిన ఆయన పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనతోపాటు విచ్చేసిన రాజమండ్రి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ పరమేశ్వరరావులను ఆలయ సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ దక్షిణకాశీగా పేరుగాంచిన పట్టిసీమ శివక్షేత్రాన్ని గతంలో కంటే సకల సౌకర్యాలతో తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు.

మద్ది ఆంజనేయస్వామికి జడ్జి అనురాధ పూజలు


మద్దిలో జడ్జి అనురాధ దంపతులకు సత్కారం

జంగారెడ్డి గూడెం రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): గుర్వాయి గూడెం మద్ది ఆంజనేయ స్వామిని కొవ్వూరు 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.అనురాధ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారికి అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం వీరికి ఆలయ ముఖ మండపం వద్ద వేదాశీర్వచనం గావించి దుశ్శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.


కిశోర్, వర్మలను అభినందిస్తున్న ఎన్జీవో అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్

అసిస్టెంట్ ఇంజనీర్స్ అధ్యక్షుడిగా కిశోర్

ఏలూరు, నవంబరు30(ఆంధ్రజ్యోతి):అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బ్రాంచి అధ్యక్షుడిగా పంజా కిశోర్, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా సాగిరాజు చైతన్య వర్మ ఎన్నికయ్యారు. ఆదివారం ఏలూరు నగరంలోని ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్సులో జరిగిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నిక నిర్వహించారు. వీరిని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ అభినందించారు.

శునకంపై మమకారంతో పచ్చబొట్టు

తణుకు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పచ్చ బొట్టు చెరిగిపోదులే నా రాజా... అని ఓ సినిమాలో హీరో హీరోయిన్ తమ ప్రేమ గురించి చెప్పుకుంటే తణుకు మండలం పైడిపర్రుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తాను పెంచుకున్న కుక్క బొమ్మనే కాలిపై పచ్చబొట్టు వేయిం చుకున్నాడు. ప్రేమతో పెంచిన కుక్క చనిపోవడంతో కాలిపై పచ్చబొట్టుగా జ్ఞాపకంగా ఉంచుకు న్నారు. పైడిపర్రుకు చెందిన చాగంటి బాలాజీ హైదరాబాద్ కేంద్రంగా అమెజాన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఇంటి నుంచే పనిచేస్తున్నాడు. ఇంటిలో ఒక కుక్కను మచ్చిక చేసుకుని పెంచుతున్నారు. అది మూడు ఈతలుగా సుమారు 30 కుక్క పిల్లలను పెట్టింది. వాటిలో ఒక కుక్క పిల్ల పేరు బుడ్డీ. 2012 జనవరి ఒకటిన పుట్టింది. బుడ్డీ తమ కుటుంబంలో ఒక సభ్యుడిగా మారిపోయిందన్నాడు. 2020 అక్టోబరు 4న చనిపోవడంతో మర్చిపోలేని బాలాజీ బుడ్డీ ఫొటోనే కాలి తొడ కింది భాగంలో వెనుక వైపున పచ్చబొట్టుగా వేయించున్నాడు. బుడ్డీ జ్ఞాపకార్థం గ్రామంలోని కుక్కలకు రోజూ ఆహారం పెట్టడం, వాటికి వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్‌లు వేయించడం వంటి సంరక్షణ చర్యలు చేస్తున్నట్లు తెలిపారు. కుక్క ఎంత విశ్వాసంగా ఉంటుందో ఆ కుక్కపై మనుషులకు అంతే ప్రేమ ఉంటుందని నిరూపించారు.




కాలిపై పెంచిన కుక్క పచ్చ బొట్టు (ఇన్‌సెట్‌లో) కుక్క (ఫైల్)

శ్రీవారి భక్తులకు డిజిటల్ సేవలు



ద్వారకాతిరుమల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని అన్ని దేవాల యాల్లో భక్తుల సౌకర్యార్థం డిజిటల్ సేవలు మరింత అందుబాటులోకి తేవాలని దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ నిర్ణయించారు. ఇటీవల జరిగిన సమావేశంలో అన్ని దేవాలయ ఈవోలకు ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చినవెంకన్న ఆలయంలో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు దృష్టి సారించారు. సులభతర దర్శనం, ఇతర సేవలు భక్తులకు మరింత సౌకర్యవంతంగా అందించేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు.

అందుబాటులో సేవలు ఇలా..

భక్తులు దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ లేదా వాట్సాప్ ద్వారా ఈ దిగువ సేవలను బుకింగ్ చేసుకోవచ్చని ప్రకటించారు.

- దర్శనములు(శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం).
- సేవలు (ఆర్జిత సేవలు)
- వసతి (అద్దె గదులు)
- డొనేషన్లు(విరాళాలు)
- కేశఖండన టికెట్లు
- ప్రసాదాలు

బుకింగ్ విధానం, నిబంధనలు..

- **వెబ్‌సైట్ :** దేవాలయాల అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి.
- **వాట్సాప్ :** 95523 00009 అనే నంబర్‌కు మెసేజ్ చేయడం ద్వారా టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

గుర్తింపు కార్డు తప్పనిసరి..

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న భక్తులు తమ ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు వివరాలను కౌంటర్‌లో పరిశీలనకు తప్పనిసరిగా సమర్పించాలి. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న భక్తుల కోసం ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేశామని ఆలయ ఈవో మూర్తి తెలిపారు. భక్తులు శ్రీవారి దర్శనం, సేవలు, ప్రసాదాలు, వసతి, కేశఖండన కోసం ఆన్‌లైన్ సేవలు వినియోగించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


సురేశ్(ఫైల్)

బుట్టాయగూడెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రెడ్డిగణపవరంలో చోటు చేసుకుంది. వేలేరుపాడు మండల కేంద్రానికి చెందిన నగిరికంటి సురేష్ మూడ్రోజులు క్రితం జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం బంధువుల ఇంటికి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకపోవడంతో సోదరుడు నగిరికంటి సాయికుమార్ జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలోని ఫారెస్టు బిల్డింగ్ సమీపంలోని గోతిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు నగిరికంటి సురేశ్(45)గా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. జంగారెడ్డిగూడెం స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదవడంతో బుట్టాయగూడెం పోలీసులు కేసు జంగారెడ్డిగూడెం స్టేషన్‌కు అప్పగించారు. ముందుగా మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు తర్వాత అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. జబీర్ తెలిపారు.

మోటారు సైకిల్ ఢీకొని ఒకరి మృతి

భీమడోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ ఢీ కొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఎలక్ట్రీషియన్ మెయ్య వెంకట రమణ(40) ఆదివారం మృతి చెందాడు. భీమడోలు జంక్షన్‌లో ఎలక్ట్రికల్ సామగ్రి కొనేందుకు దుకాణానికి వెళ్లిన వెంకట రమణ నడుపుతున్న మోటారు సైకిల్‌ను రాంగ్ రూటులో వచ్చిన మరో మోటారు సైకిల్ ఢీ కొట్టింది. ప్రమాదంలో వెంకట రమణ తలకు తీవ్రగాయమవడంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందినట్టు భీమడోలు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి పొలాల్లో కారు బోల్తా

స్వల్ప గాయాలతో బయటపడ్డ భార్యాభర్తలు


గుంతలో బోల్తా కొట్టినకారు

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కారు అదు పుతప్పి గుంతలో బోల్తాకొట్టిన ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యా యి. జంగారెడ్డి గూడెం పట్టణానికి చెందిన బొబ్బర సాయి చంద్ర కుమార్, అబ్జ దంపతులు ఆదివారం ఉదయం శ్రీనివాసపురం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వస్తున్న క్రమంలో మార్గ మధ్యలో రోడ్డుపై ఉన్న గొయ్యి తప్పించబోయి కారు బోల్తాకొట్టింది. ఇది గమనించిన స్థానికులు కారులో ఉన్న భార్య, భర్తలను బయటకు లాగారు. స్వల్ప గాయాలతో ఇద్దరూ సురక్షితంగా బయట పడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

హీటర్ షాక్ కొట్టి యువతి మృతి

భీమవరం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్నానం చేసేందుకు వేడి నీళ్ల కాచే హీటర్‌ను నీటిలో పెట్టి ఉంచగా ప్రమాదవశాత్తు షాక్ కొట్టి ఒక యువతి మృతి చెందింది.వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక బేతనీపేటకు చెందిన ఎస్.డింపిలావణ్య(19) ఆదివారం మధ్యాహ్నం స్నానం చేయడానికి బాత్‌రూమ్‌కు వెళ్లింది. అక్కడ వేడినీళ్ల కాచే హీటర్‌ను నీటిలో పెట్టింది. అయితే ప్రమాదవశాత్తు అది షాక్ కొట్టడంతో యువతి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె తండ్రి బ్రహ్మానంద కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


మృతి చెందిన నరసింహమూర్తి(ఫైల్)

అదుపుతప్పి బోల్తా కొట్టిన బొలెరో

● గండి పోశమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా ఘటన ● ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

పోలవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బొలెరో వ్యాను బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన పోలవరం ప్రాజెక్టుకి సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది.పోలవరం సీఐ బాల సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామం నుంచి 15 మంది భక్తులు గండి పోశమ్మ ఆలయానికి రాజమహేంద్రవరం మీదుగా వచ్చి దర్శనానంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో అంగుళూరు సమీపంలో క్వారీ కొండ వద్ద బొలెరో వ్యాను అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అబ్బిరాజుపాలెం గ్రామం బండివానిగట్టు ప్రాంతానికి చెందిన కాండ్రేగుల నరసింహమూర్తి(37) మృతి చెందగా జి.శ్రీనివాస్, ఎం.సురేష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని మెరుగైన చికిత్స కోసం అంబులెన్సులో రాజమహేంద్రవరం తరలించారు. స్వల్పంగా గాయపడిన మిగతా 12 మందికి పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్యకేంద్రంలో చికిత్స అందిస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి గాయపడిన వారి వివరాలు సేకరిస్తున్నట్టు సీఐ బాల సురేష్ బాబు తెలిపారు.

● యలమంచిలి: మండలంలోని అబ్బిరాజు పాలెం గ్రామం బండివానిగట్టు ప్రాంతానికి చెందిన నరసింహమూర్తి కాంక్రీటు మిల్లరు (మిక్సర్) వద్ద కూలీగా జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య నాగలక్ష్మి, తండ్రి పెద్దిరాజు, తల్లి వరలక్ష్మి ఉన్నారు. కొంతకాలం క్రితం తండ్రికి పెరాలసిస్ రావడంతో ఇంటికే పరిమితమయ్యాడు. నరసింహ మూర్తి మృతి చెందడంతో భార్య, తల్లి గుండెల విసేలా రోదిస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తుడి కుటుంబంపై దాడి


సెక్యూరిటీ ఎదుటే జరుగుతున్న ఘర్షణ

ద్వారకాతిరుమల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి శేషాచలంపై ఉన్న ఫాన్సీ దుకాణాల్లో కొనుగోలు నిమిత్తం వచ్చిన ఓ భక్తుడి కుటుంబంపై దుకాణ యజమాని, సిబ్బంది దాడికి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. నరసాపురానికి చెందిన వలవల గంగరాజు తన తల్లి త్రివేణి, భార్య ఇందిర, పిల్లలతో కలిసి శ్రీవారి దర్శనార్థం ద్వారకాతిరుమల క్షేత్రానికి ఆదివారం వచ్చారు. దర్శనానంతరం తిరుగుప్రయాణంలో అక్కడ ఉన్న బొమ్మల దుకాణంలో రెండు బొమ్మలు కొనుగోలు చేసి రూ.500 చెల్లించారు. అందులో ఓ బొమ్మ వద్దని డబ్బులు తిరిగివ్వాలని కోరగా దుకాణ యజమాని, అందులో పనిచేసే సిబ్బంది తమపై దౌర్జన్యం చేసినట్టు గంగరాజు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇంతలో క్షేత్రానికి వచ్చిన అయ్యప్ప స్వాములు కలగజేసుకుని తమను సెక్యూరిటీ వారి వద్దకు తీసుకెళ్లి వారికి విషయం చెబుతుండగా మరలా వచ్చి దుర్భాషలతో మరోసారి తన తల్లి త్రివేణిపై, తమపై దాడిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటిని సెల్ ఫోన్‌లో తీస్తుండగా ఆ ఫోన్లను పగులకొట్టారని పేర్కొన్నారు.

రెండు గ్రామాల రైతుల మధ్య భూవివాదం

గాయాలతో 13 మంది ఆస్పత్రిపాలు

నూజివీడు టౌన్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): దేవరగుంట గ్రామానికి చెందిన ఓ భూవివాదం రెండు గ్రామాల రైతుల మధ్య చిచ్చు పెట్టింది. ఈ భూ వివాదంలో 13 మంది రైతులు గాయపడ్డారు. ప్రభుత్వ భూముల సాగు విషయంలో నూజివీడు మండలం దేవరగుంట, జంగంగూడెం గ్రామాల రైతుల మధ్య ఎప్పటి నుంచో వివాదం నడుస్తోంది. 1991లో అప్పటి ప్రభుత్వం దేవరగుంట గ్రామానికి చెందిన పలువురికి ఒక్కొక్కరికి 70 సెంట్లు చొప్పున పట్టాలిచ్చింది. పక్కనే ఉన్న జంగంగూడెం ఫారెస్ట్‌లోనే కొంత భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో జంగంగూడేనికి చెందిన పలువురు ఆక్రమణల నేపథ్యంలో తమ భూముల్లో 10 సెంట్లు భూమిని రాసిమ్మని అడుగుతుండగా దేవరగుంట రైతులు వ్యతిరేకించారు. దీంతో ఇరు గ్రామాల రైతులు నూజివీడు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. ఈక్రమంలో ఇరు గ్రామాల రైతుల మధ్య వివాదం మరింత పెరిగి ఆదివారం దాడి చేసుకోవడంతో దాదాపు 13 మంది రైతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. నూజివీడు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.



కాపర్ వైరు చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్ ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నవంబర్ 29వ తేదీన తెడ్లం గ్రామ శివార్లలో గల తుమ్మల శ్రీనివాస్ చెందిన పొలంలోని ట్రాన్స్ ఫార్మర్‌ను గుర్తు తెలియని దొంగలు పగులకొట్టి కాపర్ వైరును అపహరించుకు పోయారు. దీంతో టి.నరసాపురం ఎలక్ట్రికల్ ఏఈ దాసరి శ్రీనివాసరావు ఫిర్యాదుతో ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో నీరసించి పోయి అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామానికి చెందిన సైదు వెంకన్న(47)కు మూడేళ్ల క్రితం అతని భార్య గొడవ పడి వెళ్లిపోయింది. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. మూడు రోజుల క్రితం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో అతని సోదరుడి కుమార్తె ఉండడంతో ఆమె వద్దకు వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. ఆమె ఇల్లు ఎక్కడో అతడికి తెలియలేదు. అతిగా మద్యం తాగిన అతనికి ఆహారం లేకపోవడంతో నీరసించిపోయి ఆదివారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో రూరల్ పోలీసులు పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కూలీ మృతి

ఆకివీడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ వేగం కంట్రోల్ చేసుకోలేక విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కూలి చనిపోయాడు. ఏఎస్ఐ బండి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎత్తివేగస గ్రామానికి చెందిన ఉల్లి శ్రీరాములు, మాసాది మోహన్‌రావులు కూలి పనుల నిమిత్తం కాళ్ళ మండలం కాళ్ళకూరు వచ్చి చెరువుల మీద పనులు చేస్తున్నారు. శనివారం రాత్రి మోటారు సైకిల్‌పై వంట సామగ్రి కొనడానికి ఆకివీడు వచ్చి తిరిగి వెళ్తుండగా అయి-భీమవరంలోని ఎన్టీఆర్ బొమ్మ దగ్గరకు వెళ్లే సరికే కరెంట్ స్తంభాన్ని ఢీకొన్నారు. మోటారు సైకిల్ నడుపుతున్న మోహన్‌రావు(25) తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. మరో కూలీ శ్రీరాములకు స్వల్ప గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేడు భగవద్గీత పారాయణం

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ ఏకాదశి భగవద్గీత పుట్టిన రోజని అంబికాదేవి ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ తెలిపారు. వ్యక్తుల మాదిరి భగవద్గీతకు జన్మదినోత్సవం జరుపుకునే భాగ్యం కలిగింది. శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేసిన రోజన్నారు. గీతా జయంతి జరుపుకుని గీతా మాతను పూజించడం ఆరాచమన్నారు. ఈ రోజున గీతలోని 18 అధ్యాయాలు పారాయణ చేస్తే పుణ్యం లభిస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎరువుల అమ్మకాలు, ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

కామవరపుకోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రైతుల సౌకర్యార్థం స్థానిక సొసైటీ ద్వారా ఎరువుల అమ్మకాలు, ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని సొసైటీ చైర్మన్ ఘంటా మాధవ రావు తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన సేవ లందించడమే లక్ష్యంగా ఉన్నామన్నారు. స్థానిక సొసైటీ వద్ద, రావికంపాడు రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని మాధవరావు తెలిపారు. రైతులు అవసరమైన ఎరువులను కొనుగోలు చేయవచ్చని తెలిపారు.

రాట్నాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే చింతమనేని



పెదవేగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన, ఆలయ దర్శనాలతో మానసిక ఆరోగ్యం చేకూరుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ప్రభాకర్ దర్శించుకున్నారు. ఆలయ పాలకవర్గం చైర్మన్ మన్నే శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనానంతరం వేదాశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందించారు. రాయన్నపాలెంలో రైతన్నా.. మీకోసంలో భాగంగా సీఎం చంద్రబాబు పంపించిన అభినందన లేఖలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇంటింటికి తిరిగి అందించారు. జగన్నాథపురంలోని బెయెర్షెబా ప్రార్థనా మందిరం 25వ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. బెయెర్షెబా ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు బ్రదర్ కె.సాల్మన్‌రాజు, బ్రదర్ కె.గాంధీ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో 80 మందికి వైద్య పరీక్షలు

పెదవేగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మెరుగైన వైద్య సేవలందుతాయని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అడ్వైజరీ బోర్డు డైరెక్టర్ ఈడ్పుగంటి అనిల్ కుమార్ అన్నారు. ఏలూరు కామినేని హాస్పటల్, శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెదవేగి మండలం కె.కన్నాపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 80 మందికి పైగా వ్యక్తులకు వైద్య, నేత్ర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రామ్ ప్రసీన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యుడు నెక్కలపూడి సురేష్ బాబు, అధ్యక్షుడు పావులూరి చందర్ లాల్ గాంధీ, చైర్మన్ గంగాధర ప్రసాద్, డైరెక్టర్లు వంగపండు శ్రీనివాసరావు, కోలా శ్రీనివాస్, కన్వీనర్ జాదం నరేష్, బొంతు సౌజన్య పాల్గొన్నారు.

దళితుల హక్కుల కోసం పోరాటం చేస్తాం: హరికృష్ణ

ఏలూరుటూటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దళితహక్కుల సాధన కోసం ప్రజా సంఘాలను కలుపుకుని పోరాటాలు నిర్వహిస్తామని జాతీయ సీనియర్ నేత డాక్టర్ పొలిమేర హరికృష్ణ అన్నారు. రిగ్రాండ్ పంక్షన్ హాలులో పార్టీలకు అతీతంగా సమవేశం జరిగింది. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఈ నెల 9న 12అంశాల ఏజెండాతో జాతీయస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సమస్యలపై చర్చించి తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు మధుసూధనరావు, నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, సురేశ్, బాలరాజు, జయప్రకాశ్, విమలాదేవి పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా బిల్లు ప్రవేశపెట్టాలి.

దళిత క్రైస్తవులకు ఎస్సీహోదా కల్పించే బిల్లును రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని నేషనల్ దళిత జేఏసీ ఛైర్మన్ పెరికే వరప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. సంఘ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని అసెంబ్లీలో తీర్మానించి పార్లమెంట్‌కు పంపాలని తీర్మానం చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ.. తప్పిన ముప్పు

చింతలపూడి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని మారుతీ నగర్ వద్ద ఆర్టీసీ బస్సును లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పింది. బస్సు పాక్షికంగా దెబ్బతింది. మిల్లు నుంచి అధిక లోడుతో లారీ రివర్స్ చేస్తూ రోడ్డు మీదకు తీసుకురావడంతో అక్కడ పరిశీలించే వారు ఎవరూ లేకపోవడంతో నూజివీడు ఆర్టీసీ బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టడంతో అద్దాలు పగిలి కొంత పాక్షికంగా దెబ్బతింది. అయితే ప్రయాణికులు ఉన్నా ఎవ్వరికీ ఏమీ కాలేదు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణమని స్థానికులు పేర్కొంటున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏలూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఈదరసుబ్బమ్మదేవి మున్సిపల్ హస్కూల్లో 1995-96 బ్యాచ్‌లో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చొదిమెళ్ల గ్రామంలో జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులంతా కలిసి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దాదాపుగా 30 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ప్రతీ ఒక్కరూ ఆనందంతో పొంగిపోయారు. ఈ కార్యక్రమంలో అప్పటి విద్యార్థులు ఎన్.ఆదిశేఖర్, ఈశ్వర్, హైదర్, దర్మవరపు దుర్గారావులతో సహా 70 మంది పాల్గొన్నారు.

మహా సభను జయప్రదం చేయాలి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్(ఎఐటీయూసీ) నగర మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు భజంత్రీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మునిసిపల్ వర్కర్స్ కార్యకర్తల సమావేశాన్ని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవాడ మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు 12వ పీఆర్సీ ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, రిటైర్మెంట్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంశీ, కాకాని సుబ్బారావు, గూడుపు దుర్గారావు, భాస్కరరావు, గురుప్రసాద్, దేవేంద్ర లోకేశ్వరరావు, పెద్దిరాజు, లీల ప్రసాద్ పాల్గొన్నారు.

సాల్వేషన్ ఆర్మీ చర్చిలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



దెందులూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కొవ్వలిలోని సాల్వే షన్ ఆర్మీ చర్చిలో గ్రాండ్ క్రీస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ దైవజనులు మేజర్ యేసు రాజ్యం, మేజర్ డి.లత ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వలి చర్చిలో నిర్వహించారు. స్థానిక రక్షణ సైన్యం మేజర్ కోర్ ఆఫీసర్ కె.సుబ్బారావు, మేరి కుమారి కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. గ్రామస్థులు, క్రైస్తవలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో వెలుగు నింపిన కామేశ్వరరావు

ఏలూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగ కార్మిక నాయకుడు ఎస్ఏఎస్ కామేశ్వరరావు 52వ వర్ధంతిని ఏలూరు విద్యుత్ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. విద్యుత్ రంగం కార్మికులు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. విద్యుత్ కార్మికుల కోసం పోరాడిన గొప్ప కార్మిక నేత కామేశ్వరరావు అంటూ నాయకులు కొనియాడారు.

అంతా సిద్ధం!

(5వ పేజీ తరువాయి)

హయాంలో వ్యవస్థలను నీరుగార్చారు. ఉంగుటూరు నియోజకవర్గంలో రోడ్లు, వంతెనల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన పొలసానిపల్లి గురుకుల పాఠశాల అధ్వానస్థితిలో ఉంది. నారాయణపురం జూనియర్ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. రోడ్లు అధ్వానంగా మారాయి. సింగిల్ లైన్ వంతెనలతో ఉంగుటూరు, నారాయణపురం వద్ద హైవే సమీపంలో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని డబుల్ లైన్లుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. మరోవైపు కొల్లేరు ప్రజలు నివాసం ఉండే నిడమర్రు మండలం పెదనింద్రకొలను పీహెచ్‌సీ భవనాలు శిథిలమయ్యాయి. ఇక్కడ ఐదెకరాల ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంది. పీహెచ్‌సీని 30 పడకల సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు సీఎం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. కాగా చింతలపూడి, నూజివీడు, దెందులూరు నియోజవర్గాల్లోని మెట్ట గ్రామాల్లోని రెండు లక్షలకు పైబడి ఎకరాలకు సాగు నీరందించే చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయిస్తారన్న ఆశాభావాన్ని అయా నియోజక వర్గాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు..

ఏలూరు క్రైం: సీఎం చంద్రబాబు సోమవారం ఉంగుటూరు మండలంలో పర్యటన నేపథ్యంలో వెయ్యి మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. సీఎం పర్యటన విధులలో పాల్గొనున్న సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు సమయంలో విధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలను తమకు కేటాయించిన స్థలాల్లో పార్కింగ్ చేయించాలన్నారు. అనుమతి ఉన్న వారిని మాత్రమే లోపలికి పంపించాలని, ఖచ్చితంగా వారి ఐడీ కార్డును పరి శీలించాలన్నారు. మరోవైపు గ్రేహౌండ్స్ దళాలతో, పోలీసు జాగిలాలతో, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ ఆర్.సుస్మిత, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గుండెల్లో తుఫాన్..



జంగారెడ్డిగూడెంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో



పెదవేగిలో రోడ్డుపై ఉన్న ధాన్యం

(ఆంధ్రజ్యోతి - నెట్‌వర్క్)

● ఏలూరు రూరల్ మండలం చోదిమెళ్ల, పాలగూడెం, సుంకరివారి తోట, మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి, పొణంగి, ప్రాంతాల్లో సుమారు 6వేల హెక్టార్లో వరిసాగవుతోంది. చోదిమెళ్ల, పాలగూడెంలో కోతలు ప్రారంభమయ్యాయి.

● దెందులూరు మండలంలో 15వేల 176 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టారు. మండలంలోని 7 చోట్ల కొనుగోలు కేంద్రాల ద్వారా 21 వేల 376 మెట్రిక్ టన్నుల ధాన్యం స్వీకరించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 15వేల 645 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇంకా పొలాల్లోని కల్లాల మీద 2 వేల 410 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది.

● లింగపాలెం మండలంలోని లింగపాలెం, ధర్మాజీగూడెం, యడవల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, పంట పొలాల్లోని ధాన్యం రాశులను తహసీల్దార్ నజీముల్లాషా పరిశీలించారు. తుఫాన్ నేపథ్యంలో జాగ్రత్తలు సూచించారు.

● జంగారెడ్డిగూడెం మండలంలోని లక్కవరం, పంగిడిగూడెం, పేరంపేట, గుర్వాయిగూడెం, టెక్కినవారిగూడెం గ్రామాల్లోని పంటల పొలాలను పరిశీలించారు. ఆర్డీవో ఎం.వి.రమణ మాట్లాడుతూ వరి కోతలను మూడు రోజులు ఆపాలన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ స్లీవజోజి, మండల వ్యవసాయ శాఖాధికారి పవన్ ఉన్నారు.

● పెదవేగి మండలం భోగాపురం, అమ్మపాలెం, పెదకడిమి, కొప్పాక, అంకన్నగూడెం, బి.సింగవరం, పినకడిమి, దుగ్గిరాల, చక్రాయగూడెం, ముండూరు, కూచింపూడి, న్యాయంపల్లి, నడిపల్లి, బాపిరాజుగూడెం తదితర గ్రామాల్లో వరి రైతులు మాసూళ్ల వేగవంతం చేశారు. చాలా వరకు పంట పొలాల్లో ఉండటంతో కలవరపడుతున్నారు. వ్యవసాయ శాఖ ఏలూరు సహాయ సంచాలకురాలు ఇ.అనిల కుమారి, పెదవేగి తహసీల్దారు ఎస్.డి. భ్రమరాంబ, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు.

● భీమడోలు మండలంలో మొత్తం 12,843 ఎకరాలు ఉండగా 3 వేలు కోతలకు సిద్ధంగా ఉండగా 3200 మెట్రిక్ టన్నులు ధాన్యం కళ్ళాలు, రహదా రులపై ఆరబెట్టారు. ధాన్యం తడవకుండ బకరాలు అంద జేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు.



భీమడోలులో.. పెదపాడులో.. దెందులూరులో..

లింగపాలెంలో కల్లం పరిశీలిస్తున్న దృశ్యం

భీమడోలులో..

ద్వారకాతిరుమలలో..

● పెదపాడు మండలంలో 16 వేల ఎకరాల్లో 60 శాతం నూర్పిడి పనులు పూర్తయినట్టు వ్యవసాయాధికారి షేక్ ఖాసిం తెలిపారు. ఇప్పటికే 6,400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు.

● ద్వారకాతిరుమల మండలంలో 4,850 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతోంది. ఇందులో సుమారు 4వేల ఎకరాల్లో కోత పూర్తయింది. మిగిలినవి పూర్తి చేయాల్సి ఉంది. గత దీపావళి ముందు వచ్చిన తుఫాన్ కారణంగా దిగుబడి తగ్గిందని దేవినేనివారిగూడెం రైతు షేక్ ఇస్మాయిల్ వాపోతున్నారు. మూడెకరాలకు గాను 60 బస్తాలు కూడా అవ్వడం కష్టమేనన్నారు.

● చింతలపూడి మండలంలో ఇప్పటి వరకు 11 వేల టన్నుల ధాన్యం ఎగుమతయ్యింది. 16 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. రాఘవాపురం, ఎండపల్లి ఏరియాల్లో అధిక శాతం కోతలు పూర్తికాగా కొన్ని గ్రామాల్లో కొనసాగుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



బంగారు గొలుసు అందజేస్తున్న దాతలు

దుర్గమ్మకు బంగారు నగ అందజేత

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పత్తేబాదలోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని కనకదుర్గమ్మకు నగరానికి చెందిన ఆలపాటి రమేశ్, మాధవీ లత దంపతులు 16 గ్రాముల 590 మిల్లీగ్రాములు నక్లెస్‌ను ఆలయ ధర్మకర్త పోలినాటి సత్తిరెడ్డి, ఆలయ అర్చకులు ప్రయాగ వెంకట రామ్మూర్తి, ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్‌ల సమక్షంలో అందజేశారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం దుర్గమ్మకు అలంకరించారు.



దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు

పెదపాడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణ పట్ల అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందని పెదపాడు ఇన్‌చార్జి ఎంపీడీవో ఇందిరాగాంధీ తెలిపారు. కొత్తూరు గ్రామ కార్యదర్శి మైనేని వెంకటేశ్వరరావు పదవీ విరమణ సత్కారసభ వట్లూరు ఈవో ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సన్మానగ్రహీత వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ అందరి సహకారంతో సమర్థవంతంగా చేశానని అన్నారు. విశ్రాంత ఈవోపీఆర్డీ సూర్యకుమార్, ఈవోలు వినోద్, పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధా శ్రమంలో హోమియో వైద్య సేవలు

పోలవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మా గాంధీ స్మారక వృద్ధాశ్రమంలో ఆదివారం రాజమహేంద్రవరం జగద్గురు పీఠం ఆచార్యులు పెచ్చెట్టి మల్లేశ్వరరావు పర్యవేక్షణలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది రోగులు ఉచిత వైద్య సేవలు పొంది ఉచితంగా మందులు పొందినట్లు నిర్వాహకులు డాక్టర్ బీరా విజయబాబు తెలిపారు. ప్రతి నెలా ఆఖరి ఆదివారం వృద్ధాశ్రమంలో ఉచిత హోమియో శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వృద్ధాశ్రమం నిర్వహకులు అనసూయమ్మ, బత్తుల సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

కాపు నాయకులకు 7న సన్మానం

జంగారెడ్డిగూడెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కె9 కాపు సంక్షేమ సంఘం తరపున మెట్ట ప్రాంత మండలాల్లో పలు చైర్మన్ పదవులు పొందిన కాపు సామాజిక వర్గానికి చెందిన నేతలను ఈ నెల 7న సన్మానించనున్నట్టు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం పట్టణంలో తొమ్మిదేళ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సంఘ కార్యదర్శి శీలం కృష్ణంరాజు నిర్వహణలో పలు అంశాలపై చర్చించారు. వార్షిక సభ్యత్వాల నమోదును వేగవంతం చేయాలన్నారు. 28న వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు దాకారపు కృష్ణ, పి.మోహన్, ఉద్దండం ఏసు బాబు, గణిత ఆనంద ప్రసాద్, ఆకుల ఏసు పాల్గొన్నారు.



వైద్యుడు లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టులు

ఆరోగ్యం పట్ల అవగాహన అవసరం

కొయ్యలగూడెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్ అన్నారు. ఆదివారం కొయ్యలగూడెంలోని ఆరోగ్య హాస్పటల్‌లో విలేకర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆహార అలవాటులలో మార్పు చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ప్రతీ సంవత్సరం ఆరు నెలలకు ఒకసారి పరిక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పత్రికా విలేఖర్లు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి ఊరేగింపు

కొయ్యలగూడెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య స్వామి ఊరేగింపు వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ భారీ అన్నసమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి స్వామిని నెమలివాహనంలో ఊరేగించారు. ఆలయం నుంచి ప్రధాన సెంటర్‌లో ఊరేగింపు కొనసాగింది. ప్రత్యేకంగా వివిధ నృత్యాలు ఏర్పాటు చేశారు.

నేటితో ముగియనున్న నిత్య భిక్ష

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకోటి ప్రాంగణంలో అన్నపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో అక్టోబరు 13వ తేదీ నుంచి స్వాములకు నిర్వహిస్తున్న నిత్య భిక్ష కార్యక్రమం సోమవారంతో ముగియనున్నట్లు అన్నదాన సమాజం అధ్యక్షులు కొట్టు మధు వెంకట్రావు, మనోజ్‌లు తెలిపారు.

పోలవరంతో జిల్లా ఏర్పాటు చేయాలి

పోలవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలవరం లేని పోలవరం జిల్లా ఏమిటంటూ కాంగ్రెస్ పార్టీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బండి విజయభాస్కర్ ఎద్దేవా చేశారు. ఆదివారం జరిగిన ఐక్యవేదిక సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన మాట తప్పారన్నారు. ప్రభుత్వం స్పందించి పోలవరం నియోజకవర్గం మండలాలను కలిపి పోలవరం మండలాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఒక్క మండలం కూడా లేకపోవడం హాస్యాస్పదమన్నారు. వెంటనే ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు.

ఏలూరును ఉత్తర గోదావరి జిల్లాగా పేరు మార్చండి

జంగారెడ్డిగూడెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాను ఉత్తర గోదావరిగా పేరు మార్చాలని కోరుతూ గోదావరి జిల్లా సాధన సమితి తరఫున ఆదివారం రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథిని ఉంగుటూరు నియోజకవర్గం గొల్లగూడెంలో సీఎం సభా ప్రాంగణం వద్ద కలిసి వినతి పత్రం సమర్పించారు. సభా ప్రాంగణం వద్ద ఉన్న ఆప్కాబ్ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు ఎమ్మెల్యేలను కలిసి మద్దతు కోరారు. గోదావరి సాధన సమితి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు, రాజాన పండు, షేక్ ముస్తఫా, పాలపర్తి శ్రీనివాస్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, పాతూరి అంబేడ్కర్, నిట్టా రాంకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు నాయకుల వినతి..

జీలుగుమిల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాగా ఉన్న ప్రస్తుత ఏలూరు జిల్లాను ఉత్తర గోదావరి జిల్లా లేదా గోదావరి జిల్లాగా పేరు మార్చాలని గోదావరి జిల్లా సాధన సమితి నాయకులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కోరారు. ఈ మేరకు ఆదివారం బర్రింకలపాడులో ఎమ్మెల్యేని కలిసి వినతి పత్రం అందజేశారు. గోదావరి జిల్లా సెంటిమెంట్‌ను గుర్తించాలన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతామన్నారు. గోదావరి జిల్లా సాధన సమితి నాయకులు రాజన పండు(సత్యనారాయణ), షేక్ ముస్తఫా, బి.రాజ్‌పాల్‌కుమార్, రావూరి కృష్ణ, ముప్పిడి శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీనివాస్, పాతూరి అంబేడ్కర్, బాధరాల నరేష్, నిట్ట రాంకుమార్, అందుగుల శ్యామ్, బైగాని సురేంద్ర ఉన్నారు.

రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలి

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాకు వస్తున్న సీఎం చంద్రబాబు జిల్లాలోని రైతాంగ సమస్యలపై దృష్టిసారించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అన్నేభవనంలో వారు మాట్లాడుతూ పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హావేకు సర్వీసు రోడ్లు ప్రొవిజన్ కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.

లింగపాలెంలో వాహనాల తనిఖీ

లింగపాలెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలివ్వకూడదని, పెండింగ్ చలానాలు వెంటనే చెల్లించుకోవాలన్నారు.ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

కుక్కునూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భద్రాచలం పట్టణానికి చెందిన నేతాజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం కుక్కునూరులోని శ్లోకా కన్సెప్ట్ స్కూల్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.అత్యాధునిక పరికరాలతో క్లిష్టమైన ఆపరేషన్లు చేయడం అభినందనీయమని స్థానిక నాయకులు కొనియాడారు. 150మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి తగు వైద్య సలహాలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, మల్లంపాటి నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ పిచ్చుకరాజు, జనసేన మండల అధ్యక్షుడు ఎం.యుగంధర్, బీజేపీ నాయకులు, వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు,డాక్టర్ హేమంత్ కాకర్ల, స్కూల్ కరస్పాండెంట్ పిచ్చుక మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవకు సత్యసాయి బోధనలు దోహదం

భీమడోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా బోధనలు సమాజసేవకు ప్రేరణగా నిలుస్తాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మ రాజు అన్నారు. సత్యసాయి బాబా శతవర్ష జన్మదిన వేడుకలు భీమడోలులో సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి సేవా సమితి చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. కూటమి నేతలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంవీఎల్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్నేహ సంబరం



నూజివీడు టౌన్, నవంబరు 30, (ఆంధ్రజ్యోతి):నూజివీడు శారద కళాశాలలో ఎంవీఎల్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్నేహ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఎల్ సాహితీ సమాఖ్య అధ్యక్షుడు ఎస్వీపీ ఆచార్యులు ఆధ్వర్యంలో పలువురు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మధుర పాటలను ఆలపించి ఆహూతులను అలరించారు.

వైభవంగా పెదలంకలో షష్టి ఉత్సవాలు

కలిదిండి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెదలంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోరుకొల్లులో షష్టి ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు హారతులిచ్చి పూజలు చేశారు.

శ్రీవారి భక్తులకు డిజిటల్ సేవలు



ద్వారకాతిరుమల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో భక్తుల సౌకర్యార్థం డిజిటల్ సేవలు మరింత అందుబాటులోకి తేవాలని దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ నిర్ణయించారు. ఇటీవల జరిగిన సమావేశంలో అన్ని దేవాలయ ఈవోలకు ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చినవెంకన్న ఆలయంలో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు దృష్టి సారించారు. సులభతర దర్శనం, ఇతర సేవలు భక్తులకు మరింత సౌకర్యవంతంగా అందించేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని ఈవో ఎస్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు.

అందుబాటులో సేవలు ఇలా..

భక్తులు దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ లేదా వాట్సాప్ ద్వారా ఈ దిగువ సేవలను బుకింగ్ చేసుకోవచ్చని ప్రకటించారు.

- దర్శనములు(శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం).
- సేవలు (ఆర్జిత సేవలు) ● వసతి (అద్దె గదులు)
- డొనేషన్లు(విరాళాలు) ● కేశఖండన టికెట్లు ● ప్రసాదాలు

బుకింగ్ విధానం, నిబంధనలు..

- **వెబ్‌సైట్ :** దేవాలయాల అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి.
- **వాట్సాప్ :** 95523 00009 అనే నంబర్‌కు మెసేజ్ చేయడం ద్వారా టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

గుర్తింపు కార్డు తప్పనిసరి..

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న భక్తులు తమ ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు వివరాలను కౌంటర్‌లో పరిశీలనకు తప్పనిసరిగా సమర్పించాలి. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న భక్తుల కోసం ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేశామని ఆలయ ఈవో మూర్తి తెలిపారు. భక్తులు శ్రీవారి దర్శనం, సేవలు, ప్రసాదాలు, వసతి, కేశఖండన కోసం ఆన్‌లైన్ సేవలు వినియోగించాలని కోరారు.



రాచపట్నంలో ధాన్యంపై టార్పాలిన్ కప్పుతున్న రైతు.. ముదినేపల్లి వద్ద ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న రైతులు.. గోపాలపురంలో కోతకు సిద్ధంగా వున్న వరి పొలాలు.. అన్నవరంలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తుఫాన్ టెన్షన్

» రైతుల్లో మొదలైన ఆందోళన » పొలాల వెంబడి ఉరుకులు, పరుగులు

కైకలూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ టెన్షన్ రైతులను ఉరుకులు పరుగులు పెట్టిస్తుంది. ఆరు నెలలపాటు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పండించిన పంట తుఫాన్ ఎఫెక్ట్‌తో చేతికి దక్కుతుందా లేదా అనేది రైతులను ఆందోళన కలిగిస్తుంది. ఎక్కడికక్కడే కోసిన పంటను జాగ్రత్తలు చేసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఆరబెట్టిన ధాన్యాన్ని రాసులుగా పోసి వాటిని టార్పాలిన్‌తో కప్పి తడవకుండా కాపాడుకుంటున్నారు. మరికొన్ని చోట్ల యంత్రాల సాయంతో వరి కోతలను నిర్వహిస్తున్నారు. మండల వ్యవసాయాధికారిణి ఆర్.దివ్య మాట్లాడుతూ మరో మూడు రోజుల పాటు రైతులెవ్వరూ కోతలు కోయవద్దని సూచించారు. తేమశాతం తక్కువగా ఉన్న ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాల ద్వారా రైస్‌మిల్లర్లకు తరలించాలని సూచించారు.

ఆక్వా రైతుల్లో ఆందోళన..

తుఫాన్ ఎఫెక్ట్‌తో ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం రొయ్యల చెరువుల్లో నీరు చల్లబడడంతో రైతులు నిరంతరంగా ఏరియేటర్లను తిప్పుతున్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని భావించి ముందస్తుగా డీజిల్ ఆయిల్‌ను చెరువుల వద్ద నిల్వ ఉంచుతున్నారు. కూలింగ్‌కు చెరువుల్లో ఆక్సిజన్ కొరత రాకుండా ముందస్తుగా మందులను పిచికారీ చేస్తున్నారు.

● ముదినేపల్లి : ముదినేపల్లి ప్రాంతంలో కురుస్తున్న వర్షానికి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. వరి కోతలు నిలిపివేసి పొలాల్లోని వరి పనలను కుప్పలుగా వేసి వాటిని రక్షించేందుకు పరదాలు కట్టుకుంటున్నారు. తేమశాతం తగ్గించేందుకు రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు. మండలంలో సుమారు 8వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తికాగా నాలుగు వేల ఎకరాల్లోని ధాన్యాన్ని ఇప్పటివరకు రైతులు అమ్ముకున్నారు. రైస్ మిల్లుల ఆవరణలో పెద్దఎత్తున ధాన్యాన్ని నిల్వ చేసి పరదాలు కప్పారు.

● కలిదిండి : కలిదిండి మండలంలో ఆదివారం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం గ్రామాల్లో సుమారు 600 ఎకరాల్లో వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. పలు గ్రామాల్లో రైతులు ధాన్యపు రాశులపై టార్పాలిన్‌ను కప్పి తడవకుండా కాపాడుకుం టున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో చేపలు, రొయ్యలు మేతలు తినడం లేదని వ్యా ధులు సోకే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏవో విద్యాసాగర్ మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని త్వరితగతిన మిల్లర్లకు తరలించాలన్నారు. మండల మత్స్యశాఖాధికారి రవికుమార్ మాట్లాడుతూ చేపలు, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కొరత నివారణకు నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పాలని సూచించారు.

●నూజివీడు టౌన్ : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు మరో మూడు రోజులపాటు వరికోతలు కోయవద్దని మండల వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు తెలిపారు. పంట నూర్పినవారు రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. వరిపంట కోసిన రైతులు పొలంలోనే కుప్పలు వేసి వర్షపునీరు చేరకుండా చుట్టూ కందకాలు తీయాలని సూచించారు.

● చాట్రాయి : చాట్రాయి మండలంలో 12,200 ఎకరాల్లో వరిసాగు జరగ్గా, ఇప్పటివరకు 8 వేల ఎకరాల్లో వరికోతలు జరిగాయి. ఇంకా 4,400 ఎకరాలలో పంట కోతకు సిద్ధంగా ఉంది. కొన్ని చేలల్లో మొక్కజొన్న మొక్క దశలో ఉండగా, మరికొన్ని చేలల్లో మొలక దశలో ఉంది. అధిక వర్షాలు పడితే మొక్కలు ఎర్రబారుతాయని, మొలక దశలో ఉన్నది కుళ్లిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏవో శివశంకర్ మాట్లాడుతూ రైతులు వరికోతలు రెండు రోజులపాటు వాయిదా వేసుకోవాలని సూచించారు.

● ఆగిరిపల్లి : రైతులు వరి పంటలను మూడు రోజుల పాటు కోయవద్దని మండల వ్యవసాయ అధికారి జొన్నలగడ్డ భవాని సూచించారు. అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది గ్రామాలలో ఉన్న రైతులను కలిసి అప్రమత్తంగా ఉండాలని తెలుపుతున్నా మన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

● ముసునూరు : మండలంలో 6,300 ఎకరాల్లో వరిపంట సాగుకాగా, ఇప్పటివర కు 2,500 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ముసునూరు, గుడిపాడు, చెక్కపల్లి, సూరేపల్లి, గోగులంపాడు తదితర గ్రామాల్లో వరిపంటలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఈ గ్రామాల్లో 50శాతం కోతలు పూర్తికాలేదు. పలు చోట్ల కల్లాపై ఉన్న ధాన్యం రాశులపై పరదాలు కప్పి భద్రపరుస్తున్నారు. మండల వ్యవసాయ అధికాధికాణి ఎ.చాముండేశ్వరి మాట్లాడుతూ వరి కోతలను మరో రెండు రోజులు పాటు నిలిపి వేయాలని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీహెచ్‌ఏ దుర్గాబాయి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



చాట్రాయిలో ధాన్యం కాటా వేస్తున్న రైతులు.. ముసునూరులో ధాన్యంపై పట్టా కప్పిన దృశ్యం.. తామరకొల్లులో ధాన్యపు రాశిని పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న ఏవో దివ్య.. సూరవరంలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు



రైతుల మధ్య ఘర్షణ.. నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఇరు గ్రామ రైతుల మధ్య భూవివాదం

» 13 మందికి గాయాలు.. నూజివీడు ఆసుపత్రిలో చికిత్స

నూజివీడు టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవరగుంట గ్రామానికి చెందిన ఓ భూవివాదం ఇరు గ్రామాల రైతుల మధ్య చిచ్చు రేగడంతో మొత్తం 13 మంది రైతులు గాయాల పాలయ్యారు. వివరాలివి.. గ్రామానికి చెందిన ఆర్ఎస్ నెం.1లో ఉన్నటువంటి ప్రభుత్వ భూముల సాగుపై నూజివీడు మండలం దేవరగుంట, జంగంగూడెం గ్రామాల రైతుల మధ్య వివాదం నెలకొంది. 1991లో అప్పటి ప్రభుత్వం దేవరగుంట గ్రామానికి చెందిన పలువురికి ఒక్కొక్కరికి 70 సెంట్లు చొప్పున పట్టాలు ఇచ్చింది. పక్కనే ఉన్నటువంటి జంగంగూడెం ఫారెస్ట్‌లోనే కొంత భూమిని ఆక్రమించిన వీరు తమ భూమితో కలిపి సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో జంగం గూడెంకు చెందిన పలువురు ఆక్రమణకు అనుగుణంగా తమ భూముల్లో 10 సెంట్లు భూమిని రాసిమ్మని అడుగుతున్నారని అందుకు తాము విముఖత చూపడంతో దేవరగుంట గ్రామ రైతులకు సంబంధించిన బోర్లను కోసి వేయ డం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపిస్తూ దేవరగుంట రైతులు పలువురు నూజివీడు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. ఈక్రమంలో ఇరు గ్రామాల రైతుల మధ్య వివాదం మరింత పెరిగి దాడి చేసుకోవడంతో 13 మంది రైతులు గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్య సేవలను అందిస్తున్నారు.

ఈ ఘటనలో దేవరకొండ గ్రామానికి చెందిన పల్నాటి భారతి, సిరిశెట్టి విజయ మ్మ, అండుగుల మార్తమ్మ, వరిగంజి రాజు, వరిగంజి చందు, నవీన్ కుమార్ గాయాలపాలవ్వగా జంగంగూడెం గ్రామానికి చెందిన తోమంద్రు కిషోర్, మల్లవరపు రమాదేవి, ఉయ్యూరు వెంకటేశ్వరమ్మ, తలపల వెంటేశ్వరమ్మ, తొమ్మంద్రు కవిత, కలపాల సంగీతరావు గాయాలపా లయ్యారు. క్షతగ్రాతులు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. ఏరియా ఆసుపత్రి వైద్యుల సమాచారం మేరకు సేకరించి నూజివీడు రూరల్ పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతా సిద్ధం !

(5వ పేజీ తరువాయి)

హయాంలో వ్యవస్థలను నీరుగార్చారు. ఉంగుటూరు నియోజకవర్గంలో రోడ్లు, వంతెనల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన పోలసానిపల్లి గురుకుల పాఠశాల అధ్వానస్థితిలో ఉంది. నారాయణపురం జూనియర్ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. రోడ్లు అధ్వానంగా మారాయి. సింగిల్ లైన్ వంతెనలతో ఉంగుటూరు, నారాయణపురం వద్ద హైవే సమీపంలో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని డబుల్ లైన్లుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. మరోవైపు కొల్లేరు ప్రజలు నివాసం ఉండే నిడమర్రు మండలం పెద నింద్రకొలను పీహెచ్‌సీ భవనాలు శిథిలమయ్యాయి. ఇక్కడ ఐదెకరాల ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంది. పీహె చ్‌సీని 30 పడకల సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు సీఎం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది.

కాగా చింతలపూడి, నూజివీడు, దెందులూరు నియోజవర్గాల్లోని మెట్ట గ్రామాల్లోని రెండు లక్షలకు పైబడి ఎకరాలకు సాగు నీరందించే చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయిస్తారన్న ఆశాభావాన్ని ఆయా నియోజక వర్గాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు



బందోబస్తుకు వచ్చిన పోలీసులు

ఏలూరు క్రైం:సీఎంచంద్రబాబు సోమవారం ఉంగుటూరు మండలంలో పర్యట న నేపథ్యంలో వెయ్యి మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. సీఎం పర్యటన విధులలో పాల్గొనున్న సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు సమయంలో విధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలను తమకు కేటాయించిన స్థలాల్లో పార్కింగ్ చేయించాలన్నారు. అనుమతి ఉన్న వారిని మాత్రమే లోపలికి పంపించాలని, ఖచ్చితంగా వారి ఐడీ కార్డును పరిశీలించాలన్నారు. మరోవైపు గ్రేహౌండ్స్ దళాలతో, పోలీసు జాగిలాలతో, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ ఆర్.సుస్మిత, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



స్వామికి పూజలు చేస్తున్న పెడన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ దంపతులు

సుబ్రహ్మణ్యేశ్వరుడి దేవస్థానం అభివృద్ధికి సహకరిస్తా

» పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ముదినేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి సహకారం అందిస్తానని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన సతీమణి, కుటుంబ సభ్యులతో కలిసి షష్టి కల్యాణోత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, నీలం శివరమేష్, పరసా కృష్ణ కొట్టి సుబ్బలక్ష్మి, శొంఠి నాగకొండ, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తోపాటు తన వంతు కృషి చేస్తానన్నారు.



క్వారీ లారీలను అడ్డుకున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

గ్రావెల్ క్వారీ పనులకు ప్రభుత్వం అనుమతులు

» అడ్డగించిన రైతులపై పోలీసులకు ఫిర్యాదు

ఆగిరిపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రావెల్ క్వారీ పనులకు ప్రభుత్వపరంగా అన్ని అనుమతులు ఉన్నప్పటికీ, రైతులు పర్యావరణ పరిరక్షణ పేరుతో అడ్డగిస్తున్నారని క్వారీ యజమాని సుఖవాసి శ్రీనివాస రావు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రాజధాని అమరావతికి మట్టి తరలింపు పనులను అడ్డుకుంటున్న రైతాంగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఆగిరిపల్లి మండలం కనసానపల్లి గ్రామంలోని రైతులు గ్రావెల్ తవ్వకాల అనుమతులు ఇవ్వద్దని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, కానసానపల్లి కర్రగట్టు వద్ద 2.80 ఎకరాల భూమిలో గ్రావెల్‌ను తవ్వేందుకు మైనింగ్‌శాఖ శ్రీఏకోమైన్స్ సంస్థకు లీజుకు ఇచ్చింది. ఆదివారం క్వారీలో మట్టి పనులు చేపట్టగా గ్రామానికి చెందిన ఆలూరి రామ్మోహన్‌రావు, ఎం.ప్రభాకరరావు పలువురు రైతులు క్వారీ సూపర్‌వైజర్ చందు, లారీ డ్రైవర్లపై గొడవకు వస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు క్వారీ ప్రాంతంలో అడ్డు తగులుతున్న రైతులతో చర్చించారు.

బొలెరో బోల్తా .. ఒకరి మృతి

పోలవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బొలెరో వ్యాను బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన పోలవరం ప్రాజెక్టుకి సమీపంలో ఆదివారం జరిగింది. పోలవరం సీఐ బాల సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామం నుంచి 15 మంది భక్తులు గండి పోశమ్మ ఆలయానికి రాజమహేంద్రవరం మీదుగా వచ్చి దర్శనానంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో అంగుళూరు సమీపంలో క్వారీ కొండ వద్ద బొలెరో వ్యాను అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అబ్బిరాజుపాలెం గ్రామం బండివానిగట్టు ప్రాంతానికి చెందిన కాండ్రేగుల నరసింహమూర్తి(37) మృతి చెందగా జి.శ్రీనివాస్, ఎం. సురేష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని మెరు గైన చికిత్స కోసం అంబులెన్సులో రాజమహేం ద్రవరం తరలించారు. స్వల్పంగా గాయ పడిన మిగతా 12 మందికి పోలవరం ప్రభుత్వ సామా జిక వైద్య ఆరోగ్యకేంద్రంలో చికిత్స అందిస్తున్నారు.



తామరకొల్లు జడ్పీ హైస్కూల్లో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కైకలూరు,నవంబరు30(ఆంధ్రజ్యోతి): పూర్వం చదువుకున్న పాఠశాలలో 27 ఏళ్ల తరువాత అప్పటి విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనంలో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఆదివారం కైకలూరు మండలం తామరకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్ 1991-95 వరకు ఆరు నుంచి పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గత కాలం నాటి విషయాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ప్రస్తుతం వారు ఏయే రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. రిటైర్డైన ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుతం ఉన్న ఉపా ధ్యాయులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు రాజేష్, చింతల బాబూరావు, శ్రీనివాసులరెడ్డి, కె.సత్యనారాయణ, బి.కిశోర్, తదితరులు ఆత్మీయ కలయకను ఏర్పాటుచేశారు.

విశ్వబ్రాహ్మణ మండల అధ్యక్షుడిగా నాగాచారి



నియామక పత్రాన్ని అందుకుంటున్న నాగాచారి

ముసునూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండల విశ్వబ్రాహ్మణ మండల నూతన అధ్యక్షుడిగా కడియం నాగాచారి ఎన్నిక య్యారు. ఆదివారం చెక్కపల్లిలో విశ్వబ్రాహ్మణ మండల నూతన కార్యవర్గం ఎన్నికను నిర్వహిం చారు. నూజివీడు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అరిగే పిచ్చయ్యాచారి ఆధ్వ ర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రమణక్కపేటకు చెందిన కడియం నాగాచారి, కార్యదర్శిగా చెక్కపల్లికి చెం దిన కూరెళ్ళ నాగాచారి, కోశాధికారిగా ముసునూరుకు చెందిన కాశీ శ్రీనివాసాచారిలతోపాటు మరో పదిమంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి ఐక్యంగా కృషి చేస్తామని నూ తన కార్యవర్గం సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినం దనలు తెలిపారు. నియోజకవర్గ సెక్రటరీ సీహెచ్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి 'మానవత' ఆర్థిక సాయం



పేదల వైద్యానికి చెక్కు అందజేస్తున్న కొండ్రెడ్డి సత్యనారాయణ

కైకలూరు, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): మాన వత సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల స్కాలర్‌షిప్పులకు, పేదల వైద్యానికి రూ.52500 ఆర్థిక సాయాన్ని వితరణ చేశారు. ఆదివారం కైకలూరులోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన ఈ నగదు వితరణ చేశారు. ప్రతీ నెలా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఆర్థిక సహకారాన్ని అంది స్తామన్నారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ సభ్యులు గుర్రం శ్యాంకుమార్, రుద్రపాక రత్నారావు, చింతపల్లి వెంకటనారాయణ, ఇమ్మడి పాండురంగవిఠల్, తులాల మధు, ఎస్. జమీల్ అహ్మద్, గొల్లు బాబి, పెద్దింటి కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

'సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ముసునూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 27 నుంచి జనవరి 4 వరకు జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రాజు పిలుపునిచ్చారు. ఆదివారం ముసునూరు మెయిన్ సెంటర్‌లో మహాసభల పోస్టర్లను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోందని, దీనివల్ల కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. కార్మికులు, కర్షకులు, ప్రజలు ఐక్యతగా పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటడానికి తీసుకుకోవాల్సిన కార్యాచరణపై చర్చలు జరుగుతాయన్నారు. మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



పెట్రోలు బంకు వద్ద పూజలు చేస్తున్న గోళ్ల కల్యాణ్‌కుమార్ దంపతులు

చాట్రాయిలో పెట్రోల్ బంకు ప్రారంభం

చాట్రాయి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో ప్రధాన రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును ఆదివారం విజయవాడ వేగా జ్యూయలరీస్ అధినేత వనమా సుధాకర్ ప్రారంభించారు. ఈ బంకును స్థానిక వ్యాపార ప్రముఖుడు, హైదరాబాద్ వేగా జ్యూయలరీస్ అధినేత గోళ్ల కల్యాణ్‌కుమార్ ఏర్పాటు చేశారు. బంకు ప్రారంభోత్సవానికి పలువురు వ్యాపార, రాజకీయ ప్రముఖులు గ్రామస్థులులు పాల్గొన్నారు.

తండ్రిపై కుమారుడి దాడి

కైకలూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సోదరి ప్రేమ వివాహానికి సహకరించాడని తండ్రిపై కుమారుడు దాడి చేసిన ఘటన కైకలూరు మండలం గోనెపాడులో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పొన్నూరు రాంబాబుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ఇటీవల ఓ యువకుడిని ప్రేమ వివాహం చేసుకుంది. అందుకు తండ్రి సహాయ సహకారాలు అందించాడని రాంబాబు కుమారుడు నాగరవితేజ గొడవకు దిగాడు. నవంబరు 26న దీనిని పురస్కరించుకుని తండ్రిపై దాడి చేయగా తీవ్ర గాయాలు కావడంతో కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం రూరల్ ఎస్ఐ వి. రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలపై దాడి.. ఐదుగురి అరెస్టు

మండవల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం అప్పాపురం గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న శిబిరంపై దాడి చేసి ఐదుగురుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు. వారి వద్ద నుంచి ఒక కోడి పుంజు, ఒక కత్తి, రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో నీరసించి పోయి అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామానికి చెందిన సైదు వెంకన్న(47)కు మూడేళ్ల క్రితం అతని భార్య గొడవ పడి వెళ్లిపోయింది. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. మూడు రోజుల క్రితం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో అతని సోదరుడి కుమార్తె ఉండడంతో ఆమె వద్దకు వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. ఆమె ఇల్లు ఎక్కడో అతడికి తెలియలేదు. అతిగా మద్యం తాగిన అతనికి ఆహారం లేకపోవడంతో నీరసించిపోయి ఆదివారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో రూరల్ పోలీసులు పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.